ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మేయర్ పీఠం కూటమి కైవసం



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు



ఎన్నికల అధికారి హోదాలో అవిశ్వాస తీర్మానాన్ని చదువుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

గొలగాని హరి వెంకటకుమారిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



గొలగాని హరివెంకటకుమారి



మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో కూటమి నేతల సంఘీభావం

మద్దతుగా 74 మంది సభ్యులు ఓటు

- 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు...
- అనుకూలంగా ఓటు వేసిన ముత్తంశెట్టి ప్రియాంక
- సమావేశానికి వైసీపీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు దూరం
- జీవీఎంసీ ఎదుట టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సంబరాలు
- విప్‌ను ఉల్లంఘించిన తమ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వైసీపీ ఫిర్యాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకుంది. వైసీపీకి చెందిన ప్రస్తుత మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై శనివారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కొత్త మేయర్ ఎన్నికకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ అత్యధిక వార్డులను ... మిగతా 6వ పేజీలో

వైసీపీ అవినీతిని భరించలేకే అవిశ్వాసం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ
- నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

మేయర్ గొలగాని హరివెంకటకుమారి నాలుగేళ్ల పాలనలో జీవీఎంసీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరగడంతో ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని, అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టామని జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. హరివెంకటకుమారి డమ్మీగా మారిపోయారని, మేయర్ అంటే ఎలాంటి అభివృద్ధి చేయవచ్చునో ఇకపై నగరవాసులు చూస్తారన్నారు. నగరంలో అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడంతోపాటు అవినీతి లేని పాలన అందిస్తామన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పుట్టినరోజు బహుమతిగా జీవీఎంసీ మేయర్ పీఠాన్ని అందజేస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో జీవీఎంసీని దోచుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారని, కూటమి హయాంలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులు మేయర్‌పై అవిశ్వాసం నెగ్గేలా శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు.

విప్‌ను ఉల్లంఘించారంటూ 27 మంది కార్పొరేటర్లపై వైసీపీ ఫిర్యాదు

అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశానికి వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు హాజరుకాకూడదని, అలాగే తీర్మానానికి మద్దతుగా ఓటు వేయకూడదని ఆ పార్టీ విప్ జారీచేసింది. అయితే టీడీపీ, జనసేనల్లో చేరిన వైసీపీకి చెందిన 27 మంది కార్పొరేటర్లు సమావేశానికి హాజరవడంతోపాటు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ చేతులు ఎత్తారు. దీంతో పార్టీ విప్‌ను ఉల్లంఘించిన వారి జాబితాను జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌కు ఆ పార్టీ నేత తైనాల విజయ్‌కుమార్ అందజేశారు. వారం రోజుల్లోగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

మేయర్‌గా నాలుగేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

- గొలగాని హరివెంకటకుమారి

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ మేయర్‌గా నాలుగేళ్ల పాలన తనకు సంతృప్తినిచ్చిందని గొలగాని హరి వెంకటకుమారి శనివారం ఒక ప్రకటనలో ... మిగతా 6వ పేజీలో

మేయర్‌గా పీలా శ్రీను?



జీవీఎంసీ కార్యాలయం వద్ద పీలా శ్రీనివాసరావును అభినందిస్తూ భుజాలపై మోసుకుంటూ తీసుకువస్తున్న కార్యకర్తలు

- దాదాపుగా ఖరారు
- డిప్యూటీ మేయర్ పదవుల కోసం తీవ్రస్థాయిలో పోటీ
- టీడీపీ, జనసేన, బీజేపీల్లో భారీగా ఆశావహులు
- తలలు పట్టుకుంటున్న నేతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో తదుపరి మేయర్ ఎవరనే చర్చ మొదలైంది. అయితే మేయర్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన పీలా శ్రీనివాసరావు పేరు దాదాపు ఖరారు కాగా, డిప్యూటీ మేయర్ పోస్టుల కోసం కార్పొరేటర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎవరికి వారే పదవులను ఆశిస్తుండడంతో కూటమి నేతలు తలలు పట్టుకుంటున్నారు.

మేయర్‌గా టీడీపీ ఫ్లోర్ లీడర్, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావును ఎన్నుకోవాలని కూటమి కార్పొరేటర్లతోపాటు నేతలు కూడా దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చేశారు. దీంతో పీలా శ్రీనివాసరావు ఎన్నిక లాంఛనం కానున్నది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూడా కూటమి నేతలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇవ్వడంతో ఈనెల 26న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు. ఈలోగానే జియ్యాని శ్రీధర్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసే అవకాశం ఉందంటున్నారు. శ్రీధర్ రాజీనామాతో ఖాళీ అయ్యే డిప్యూటీ మేయర్ పోస్టు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. టీడీపీ నుంచి 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, జనసేన నుంచి 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పోటీపడుతున్నారు. బీజేపీ నుంచి 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత డిప్యూటీ మేయర్ పదవి ఆశిస్తున్నారు. మేయర్ పదవిని టీడీపీ తీసుకుంటుండడంతో, డిప్యూటీ మేయర్ పదవి తమకు ఇవ్వాలని జనసేన నేతలు గట్టిగా పట్టుబడుతున్నారు. అయితే మేయర్‌గా ఉన్న యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళను తొలగిస్తున్నందున డిప్యూటీ మేయర్ పదవిని ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఇవ్వాలని టీడీపీ నేతలు వాదిస్తున్నారు. అలాగైతే మొల్లి హేమలత, గొలగాని మంగవేణిలో ఒకరికి ఇవ్వాల్సి వస్తుంది. ఒకవేళ అదే జరిగితే విద్యావంతురాలైన హేమలతవైపే నేతలు మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. అయితే కాపు సామాజికవర్గానికి చెందిన జియ్యాని శ్రీధర్‌ను తప్పిస్తే ఆసామాజిక వర్గానికి చెందిన వారికే అవకాశం ఇవ్వాలని టీడీపీ నేతలు కొందరు వాదిస్తున్నారు. అప్పుడు 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు చాన్స్ దక్కుతుంది. ఒకవేళ యాదవ సామాజిక వర్గానికి చెందినవారికి ఇవ్వాలనుకుంటే మాత్రం 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పేరును పరిశీలించే అవకాశం ఉంది.

జనసేనకు డిప్యూటీ మేయర్ పదవి చాన్స్ వ స్తే ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై ఆ పార్టీలో విశ్లేషణలు మొదలయ్యాయి. జనసేన నుంచి మొదట ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ ... మిగతా 6వ పేజీలో



మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకోవడంతో జీవీఎంసీ కార్యాలయం బయట బాణసంచా కాలుస్తూ కూటమి కార్యకర్తల సంబరాలు

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

విశాఖ విద్యార్థుల ప్రతిభ

ఓపెన్ కేటగిరీలో 26, 64, 75, 86, 95, 116, 138, 212, 255, 271, 294, 311, 326, 328, 380, 407, 422, 459, 461, 481, 494 ర్యాంకులు



పప్పల శ్రీహర్షవర్ధన్ 26వ ర్యాంకు



బి.విక్రమ్‌రాజ 64వ ర్యాంకు



పి.సూర్యకార్తీక్ 75వ ర్యాంకు



టినూ ఆనంద చక్రవర్తి 86వ ర్యాంకు



ఎ.పాండే 95వ ర్యాంకు



ఎం.పూర్ణసాయి 116వ ర్యాంకు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో విశాఖపట్నం విద్యార్థులు మంచి ప్రతిభచూపారు. ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ తొలి వారంలో రెండుసార్లు నిర్వహించిన పరీక్షలలో వచ్చిన పర్సంటైల్ మేరకు ర్యాంకులు ఖరారు చేసి విడుదల చేశారు. వాటి ప్రకారం విశాఖలో కార్పొరేట్ కళాశాలలు శ్రీచైతన్య, నారాయణ, అసెంట్, శ్రీవిశ్వ, ఇతర విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో పప్పల శ్రీహర్షవర్ధన్ 26వ ర్యాంకు, బి.విక్రమ్‌రాజ్ 64, పి.సూర్యకార్తీక్ 75వ ర్యాంకు, టినూ ఆనంద చక్రవర్తి 86, ఎ.పాండే 95, ఎం.పూర్ణసాయి 116, గణసాయి ప్రతాప్ 138, ఆర్.కార్తీక్ 212, బి.రోహిత్ దత్త 255, ఎ.సాత్విక్ 271, జ్ఞాన రుత్విక్ సాయి 294, చరణ్ కార్తికేయ 311, ఎల్.సాయి ప్రీతం 326, టి.మనోహర్ 328, ఎస్.హరిచరణ్ 380, కె.రసజ్ఞ ఏ.తారకరామ్ 407, 422, బి.మహంత్ 459, పి.సుబ్రహ్మణ్యం 461, పి.కార్తికేయ 481, వెంకట్ అరవింద్ 494వ ర్యాంకు సాధించారు. ఇంకా 1000లోపు సుమారు 50 ... మిగతా 6వ పేజీలో

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

250 ఎకరాలు గుర్తింపు

ప్రపంచం ఐటీ దిగ్గజం గూగుల్ సంస్థ విశాఖపట్నం రాకకు మార్గం సుగమమైంది. వారికి అవసరమైన భూమిని జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లా కేంద్రం నుంచి 26 కి.మీ. దూరానున్న ఆనందపురం మండలం తర్లువాడలో 250 ఎకరాలు గుర్తించింది. ఇది ఆనందపురం మండల కేంద్రానికి మూడు కి.మీ., జాతీయ రహదారి-16కు 1.5 కి.మీ. దూరంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహ్వానాన్ని అందిపుచ్చుకొని విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని 2024 డిసెంబరులోనే గూగుల్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థ గ్లోబల్ నెట్‌వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ బికాశ్ కోలే విశాఖపట్నం వచ్చి అనువైన భూముల కోసం పలు ప్రాంతాలను పరిశీలించారు. సుమారుగా 80 ఎకరాలు అవసరం అవుతుందని జిల్లా అధికారులకు తెలిపారు. విశాఖ జిల్లా మొత్తం సిటీ కావడం ఒక్క భీమునిపట్నం నియోజకవర్గంలోనే గ్రామీణ ప్రాంతాలు, పెద్ద సంఖ్యలో భూములు ఉండడంతో అధికారులు వాటినే గూగుల్ ప్రతినిధులకు చూపించారు. అనేక చర్చలు అనంతరం తర్లువాడ భూములనే




తర్లువాడలో గూగుల్ కోసం గుర్తించిన భూమి

గూగుల్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే మధురవాడలో హిల్ నంబరు 4పై అదానీ డేటా సెంటర్ పనులు జరుగుతున్నాయని, ... మిగతా 6వ పేజీలో

29న సీఎం రాక

- 30న చందనోత్సవం నాడు సింహాద్రి అప్పన్నకు పట్టువస్త్రాల సమర్పణ
- నగరంలో పలు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభింపజేసేందుకు అధికారుల ఏర్పాట్లు
- జాబితాలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ బిల్డింగ్ 'ది డెక్', హెలికాప్టర్ మ్యూజియం





సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ 'ది డెక్'

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న విశాఖపట్నం రానున్నారు. 30వ తేదీన సతీమణితో కలిసి సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చేసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేయించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ముఖ్యమైన రెండు ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. అందులో ఒకటి...సిరిపురంలోని ఉద్యోగ భవన్ ముందు నిర్మించిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం 'ది డెక్. ఇది పేరుకు కారు పార్కింగ్ భవనమే అయినప్పటికీ అందులో రాష్ట్ర ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. దానికి కేటాయించగా మిగిలిన స్థలం ఐటీ సంస్థలకు ఇవ్వనున్నారు. మొత్తం 1.72 ఎకరాల స్థలంలో రూ.87.5 కోట్లతో 11 అంతస్థుల భవనం అధునాతనంగా నిర్మించారు. బేస్‌మెంట్‌లో మూడు అంతస్థులు, ఆపైన ఒకటి, రెండు ... మిగతా 6వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో 1,139 టీచర్ పోస్టులు

- ఎస్జీటీ 574, స్కూల్ అసిస్టెంట్ 560, జువెనైల్ పాఠశాలల్లో 5 ఖాళీలు
- డీఎస్సీ షెడ్యూల్ విడుదల
- నేడు నోటిఫికేషన్

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

నిరుద్యోగ ఉపాధ్యాయులకు తీపికబురు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ షెడ్యూల్‌ను ప్రభుత్వం శనివారం రాత్రి విడుదల చేసింది. గత ఏడాది సీఎంగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే టీచర్ల నియామకాలకు చేసిన తొలి సంతకం చేశారు. అన్ని అడ్డంకులు తొలగిన తరువాత ఇప్పుడు షెడ్యూల్ జారీచేశారు. నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేయనున్నారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో అన్ని కేటగిరీలు కలిపి 1,139 ఖాళీలు భర్తీ చేస్తారు. వీటిలో 574 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు, 560 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, జువెనైల్ సంక్షేమ పాఠశాలల్లో ఐదు పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు జోన్-1 (ఉత్తరాంధ్రలో పాత మూడు జిల్లాలు కలిపి)లో అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని కేటగిరీలు కలిపి 400 పోస్టులు భర్తీ చేస్తారు.

560 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 560 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ పాఠశాలల్లో 495, గిరిజన ... మిగతా 6వ పేజీలో

సత్తెమ్మ తల్లి పాదాలు ప్రతిష్ఠ

సింహాచలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరి, అడివివరం గ్రామస్తుల ఆరాధ్య దేవత సత్తెమ్మతల్లి (మరిడిమాంబ) సన్నిధానంలో అమ్మవారి పాదాలను శనివారం ప్రతిష్ఠించారు. వేకువ జామున అమ్మవారిని మేల్కొలిపి పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి నూతన పాదాలను ప్రతిష్ఠించి, పూజలు చేశారు.

'జూట్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

తగరపువలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించని యాజమాన్యంపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్మిక సంఘాల సమక్షంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు యాజమాన్యంతో చర్చించినప్పుడు పది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని,మిల్లు యాజమాన్య ప్రతినిధులు హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

మే 25న పీహెచ్‌డీలో ప్రవేశాలకు పరీక్ష

సాగర్‌నగర్/ఎండాడ, (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు మే 25న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. విశాఖ, హైదరాబాద్, బెంగళూరులో ఉన్న క్యాంపస్‌లలో పలు విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు గాను ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు గీతం రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ వి. నందూరి తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మసీ విభాగానికి జూన్ 1న పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల్లో ఎంపికైన వారికి జూన్ 5 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల వారు మే 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వెంకన్నకు పూజలు

మధురవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు నగరంపాలెం రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూల నక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పలు పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన తరువాత, భక్తులకు దర్శనాలు కల్పించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మ దినోత్సవానికి ఏర్పాట్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే గంటా క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు 75వ జన్మ దినోత్సవం వేడుకలు ఆదివారం జరగనున్నాయి. ఈమేరకు నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ వేడుకలకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ వర్గాలు పిలుపునిచ్చాయి.

160 సైకిళ్లు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ, నాగమయ్యపాలెం, అన్నవరం, మూలకుద్దు, తూడెం పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 160 మంది బాలికలకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. దివీస్ కర్మాగారం సౌజన్యంతో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు రావడానికి ఇబ్బందులు పడుతుండడంతో సైకిళ్లు కొనుగోలు చేసి ఇచ్చామని తెలిపారు. అనంతరం బాలికలతో కలిసి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దివీస్ కర్మాగారం సామాజిక సేవా విభాగం ఉద్యోగులు సురేశ్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.



సింహగిరిపై ప్రతిజ్ఞ చేస్తున్న ఈఓ సుబ్బారావు, దేవస్థానం అధికారులు



భీమిలి జోనల్ కార్యాలయం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అధికారులు
- మండలాల్లో ర్యాలీలు

భీమునిపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలుచోట్ల అధికారులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భీమిలి జోన్ 3వ వార్డులో జోనల్ కార్యాలయం వద్ద జోనల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. తొలుత కార్యాలయం వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్వాక్రా మహిళలు, జోనల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గంట స్తంభం కూడలిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీఎం నాయుడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. మహిళలు ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని సింగనబందలో మండల పరిషత్ కార్యాలయం అధికారులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ జీవీ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి పి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ రమేశ్‌నాయుడు, నాయకులు తాతినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలసలో భీమిలి జోనల్ కార్యాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి వైఎస్ఆర్ కూడలి వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అధికారులు పరిసరాల పరిశుభ్రత, పాలిథిన్ కవర్ల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే దుకాణదారులు ఘన, ద్రవ వ్యర్థాలను ఎలా వేరే చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం : ప్రజలంతా స్వర్ణాంధ్రా, స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఈఓ కొమ్ముల సుబ్బారావు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం రాజగోపురం ఎదుట ఉన్న నక్షత్ర వనంలో సిబ్బంది చెత్త ఏరివేసి, తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ సంగం రాధ, ఈఈ దండు గణపతి శ్రీనివాస రాజు,డీఈఈ నాగేశ్వరరావు, డీవీఎస్ రామరాజు (హరి), ఏఈఓ ఎన్. ఆనందకుమార్, పర్యవేక్షణాధికారులు రాజ్యలక్ష్మి, సత్యవాణి పాల్గొన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నరసింహం ఆధ్వర్యంలోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొమ్మాది : ఎలక్ట్రానిక్ వస్తువుల వేస్ట్ రీ సైక్లింగ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చంద్రంపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి అన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు వాడడం సాధారణమని, అవి నిరుపయోగంగా మారిన తరువాత చెత్తలో వేయడం వల్ల భూమిలో ఉండిపోయి అనేక అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేయర్ పీఠం కూటమి కైవసం

... 5వ పేజీ తరువాయి

గెలుచుకోవడంతో 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి మేయర్‌గా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు దాదాపు సగం మంది టీడీపీ,జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. దీంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూటమి నేతలు భావించారు. అయితే నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టాలన్న నిబంధన కారణంగా సాధ్యపడలేదు. గత నెల 18 నాటికి మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తవ్వడంతో 21న కూటమి కార్పొరేటర్లు 57 మంది సంతకాలతో మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దానిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 19న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కౌన్సిల్‌లో 2/3 వంతు సభ్యులు మద్దతు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు... మొత్తం 111 మంది ఓటుహక్కు కలిగినవారు ఉన్నారు. వీరిలో 2/3 వంతు అంటే 74 మంది అవిశ్వాసానికి మద్దతు తెలపాల్సి ఉంటుంది. అయితే నోటీస్ ఇచ్చే సమయానికి కూటమికి అంత బలం లేకపోవడంతో...తమ కార్పొరేటర్లను వైసీపీ నేతలు వెంటనే (గత నెల 23న) బెంగళూరు తరలించారు.అక్కడ నుంచి శ్రీలంక, కేరళ పర్యటనకు తీసుకువెళ్లారు. మరోవైపు కూటమి నేతలు తమ కార్పొరేటర్లను మలేషియా తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా?,వీగిపోతుందా?...అనే ఉత్కంఠ నెలకొంది. అయితే నాలుగు రోజుల కిందట వైసీపీ నేత బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లుగా ఉన్న తన భార్య, కోడలితో సహా జనసేనలో చేరిపోయారు. అదేవిధంగా గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కూడా జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 74కి పెరిగింది. కానీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడం, తమతో ఉన్న కార్పొరేటర్లకు వైసీపీ నేతలు గాలం వేస్తుండడంతో కూటమి నేతలు కంగారుపడ్డారు. ఎవరైనా వెళ్లిపోతే ఆ లోటును పూడ్చుకునేందుకు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రి వరకూ హైడ్రామా నెలకొంది. చివరకు మలేషియాలో ఉన్న కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకోగా, వారిలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత తప్పించుకుని కేరళలోని వైసీపీ క్యాంపునకు చేరిపోయారు. మేజిక్ ఫిగర్ 74 అయితే తమ వద్ద 73 మంది మాత్రమే ఉండడంతో కూటమి నేతలు ఆందోళనకు గురయ్యారు.ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశానికి హాజరుకావడంతోపాటు మద్దతు తెలిపేలా ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు.

74 మంది మద్దతు

కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జీవీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. కూటమి కార్పొరేటర్లంతా రెండు బస్సుల్లో నేరుగా హోటల్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సమావేశం ప్రారంభించడానికి అవసరమైన కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానాన్ని ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సభ్యులందరికీ చదివి వినిపించారు. మేయర్‌పై అవిశ్వాసానికి మద్దతు తెలిపేవారు చేతులు ఎత్తాలని కోరగా 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు చేతులు ఎత్తారు. వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉండేవారు చేతులు ఎత్తాలని కలెక్టర్ కోరగా, ఎవరూ చేతులు ఎత్తకపోవడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు కలెక్టర్ ప్రకటించారు. ఈ ప్రక్రియను నాలుగు వీడియో కెమెరాల్లో రికార్డు చేయించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి, మేయర్ పీఠం కూటమి వశం కావడంతో జీవీఎంసీ కార్యాలయం బయట కూటమి అభిమానులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఉపాధి నిధులతో ఉద్యాన పంటలు



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పద్మనాభం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఖాళీ భూముల్లో ఉపాధి హామీ పథకం నిధులతో ఉద్యాన పంటలు పండించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి చెప్పారు. శనివారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంటలు పండించకుండా ఖాళీగా విడిచిపెట్టిన భూములను గుర్తించాలన్నారు. వాటిలో పండ్ల తోటల పెంపకానికి అవసరమైన మొక్కలను ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా సరఫరా చేయడంతో పాటు పెట్టుబడి సాయం కూడా ఇస్తామన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 5వ పేజీ తరువాయి

మంది, 2000లోపు 200 మంది ర్యాంకులు సాధించారు. వచ్చే నెలలో జరిగే ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు వీరంతా అర్హులు అవుతారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే ఐఐటీలో ప్రవేశాలు లభిస్తాయి. లేనిపక్షంలో జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా ఎన్ఐటీలు, ప్రముఖ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు దొరుకుతాయి.

29న సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

అంతస్థులు (మొత్తం ఐదు అంతస్థులు) పార్కింగ్‌కు కేటాయించారు. వీటి విస్తీర్ణం 1.9 లక్షల చదరపు అడుగులు. వీటిలో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు కేటాయిస్తారు.

బీచ్‌రోడ్డులో హెలికాప్టర్ మ్యూజియం

తూర్పు నౌకాదళంతో కలిసి వీఎంఆర్‌డీఏ ఆర్‌కే బీచ్‌లో 'యుహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను మ్యూజియంగా మార్చింది. ఇది సీ హ్యారియర్ మ్యూజియానికి, టీయూ 142 మ్యూజియానికి మధ్యన ఉంటుంది. నేవీలో సేవల నుంచి విరమించిన హెలికాప్టర్‌ను తీసుకొచ్చి రూ.2.2 కోట్లతో మ్యూజియంగా మార్పు చేసింది. ఇది పూర్తయి మూడు నెలలు కావస్తోంది. దీనిని కూడా సీఎం చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఇంకా మరి కొన్ని కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

మేయర్‌గా నాలుగేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అత్యున్నత హోదాలో నగర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. ప్రజారోగ్యం మెరుగుపరచడంతోపాటు గోశాల నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ నిర్మాణం పూర్తి, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ, బస్‌బేల నిర్మాణం తనకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసినప్పటికీ తనపై అవిశ్వాస తీర్మానం పెట్టడం కలచివేసిందన్నారు. తనకు సహకరించిన నగరవాసులు, అధికారులు, కార్పొరేటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'గోశాలపై రాజకీయం తగదు'

భీమునిపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ గోశాలలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే వైసీపీ నాయకులు రాజకీ యం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అన్ని రంగాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ఉమ్మడి జిల్లాలో 1,139 టీచర్ పోస్టులు..

... 5వ పేజీ తరువాయి

సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 65 ఖాళీలు ఉన్నాయి. వీటిలో తెలుగు 33, హిందీ 39, ఇంగ్లీష్ 55, గణితం 66, భౌతికశాస్త్రం 63, జీవశాస్త్రం 58, సాంఘిక శాస్త్రం 96, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 139 ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ ఖాళీలు మైదానంలో అన్ని యాజమాన్యాల పరిధిలో 239, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 335 ఖాళీలు ఉన్నాయి. మైదానం కంటే ఏజెన్సీలోనే ఎస్జీటీ ఖాళీలు ఉన్నాయని గుర్తించారు. కాగా నగరంలో జువెనైల్ సంక్షేమ శాఖ పరిధిలో బాలల కౌమార పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు నాలుగు, స్కూలు అసిస్టెంట్ పోస్టు ఒకటి వెరసి ఐదు ఉన్నాయి.

మేయర్‌గా పీలా శ్రీను?

... 5వ పేజీ తరువాయి

భీశెట్టి వసంతలక్ష్మి పేరు పరిశీలనకు వస్తుంది. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు మేయర్ పదవి దక్కినందున ఆమెకు అవకాశం ఉండదని నేతలు చెబుతున్నారు. అలాంటప్పుడు కొత్తగా పార్టీలో చేరిన కాపు సామాజిక వర్గానికి చెందిన 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేరు పరిశీలించే అవకాశం ఉంది. అందుకోసం ఆమె తనవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఆమె ఇటీవలే వైసీపీ నుంచి వచ్చినందున మొదటి నుంచి జనసేన, టీడీపీల్లో ఉన్న కార్పొరేటర్లు అంగీకరించే పరిస్థితి ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటప్పుడు 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు పరిశీలనకు రావచ్చునని, అయితే సామాజిక వర్గాల సమీకరణాల్లో ఆయనకు అవకాశం దక్కడం కష్టమేనని జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత కూడా డిప్యూటీ మేయర్ పదవి కోసం ఆ పార్టీ నేతలపై ఒత్తిడి చేస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ విద్య

కొమ్మాది, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి కోరారు. శనివారం ఆయన పాఠశాలలో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21 నుంచి పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని, తల్లిదండ్రులు పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన

తగరపువలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి, పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలని విజయనగరం జేఎన్‌టీయూ డైరెక్టర్ డా. టి. స్వామినాయుడు అన్నారు. తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల సందర్శన, వర్క్‌షాప్, ఇంటర్న్‌షిప్ వంటివి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని చెప్పారు. కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు కోడి సునీల్, అంబారకొండ చిరంజీవి, సింగంపల్లి వాసు,ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు రాజు, గోవిందరావు, ప్లేస్‌మెంటు అధికారులు టి. శ్రీనివాసరావు, రూప్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్

... 5వ పేజీ తరువాయి

తర్లువాడలో మరో డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేస్తుందని, దీంతో విశాఖపట్నం పెద్ద డేటా సెంటర్‌గా మారనుందని గంటా వెల్లడించారు.

విశాఖలో సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ సెంటర్

డేటా సెంటర్ నిర్వహించాలంటే అత్యంత వేగవంతమైన 'స్పీడ్ ఇంటర్నెట్' అవసరం. దీనికి అవసరమైన కేబుల్‌ను ల్యాండ్ లైన్ ద్వారా కాకుండా సముద్ర గర్భం నుంచి తీసుకువస్తారు. దీనిని 'సబ్‌మెరైన్ కేబుల్'గా వ్యవహరిస్తారు. సింగపూర్ నుంచి తీసుకువచ్చే ఈ లైన్‌కు విశాఖపట్నంలో 'కేబుల్ ల్యాండింగ్ స్టేషన్' (సీఎల్ఎస్) ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దేశంలో ఇలాంటి స్టేషన్లు ఇప్పటికే ముంబై, చెన్నై, కొచ్చిన్, టుటికోరిన్, త్రివేంద్రంలలో ఉన్నాయి. కొత్తగా విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వల్ల ఇక్కడ అదానీ, గూగుల్ సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకువచ్చాయి.



ఏయూలో పరిసరాలు శుభ్రపరుస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఏయూ అధికారులు, విద్యార్థులు



విమ్స్‌లో వైద్యులు, సిబ్బందితో సచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు



వెంకోజీపాలెం : పరిశుభ్రం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

స్వచ్ఛత నిత్యకృత్యం కావాలి

- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో వక్తల సూచన
- పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పలు వార్డుల్లో చెత్తాచెదారాల తొలగింపు
- పాడైన ఎలక్ట్రానిక్ పరికరాల ఏరివేత

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతను ఒక అలవాటుగా చేసుకోవాలని, అప్పుడే మార్పు సాధ్యపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. శనివారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కళాశాల పరిసరాలలోని వ్యర్థాలను తొలగించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్వీయ క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ముఖ్యంగా.. ప్రజల్లో స్వచ్ఛత పట్ల అవగాహన పెంచడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంతో అవసరమన్నారు. భవిష్యత్తు అధ్యాపకులుగా మారే మీరంతా పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించాలని సూచించారు. ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో స్వచ్ఛతను ఒక అలవాటుగా మారుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. కార్యక్రయంలో విభాగాధిపతి టి.షారోన్ రాజు, డాక్టర్ ప్రకాష్‌రావు, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో వైద్యులు, సిబ్బంది శనివారం పరిసరాలు శుభ్రపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను శుభ్రం చేశారు. కంప్యూటర్లు, ఫ్యాన్లు, సర్జరీ యంత్రాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల్లో విష పదార్థాలు ఉంటాయన్నారు. అందుకే వీటిని ఎప్పటికప్పుడు పారవేయాలని సూచించారు. వీటిని ఎక్కడ పడితే అక్కడ పారవేయకూడదన్నారు. చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికరాల పై కలిగే అనర్థాలపై తీసిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో..

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర మన అందరి కర్తవ్యమని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. శనివారం ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం వలంటీర్లు వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్

సిరిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ వ్యర్థాల సేకరణ, రీ సైకింగ్‌కు అనుగుణంగా వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ ఉద్యోగ భవన్ కాంప్లెక్స్‌లోని అన్ని అంతస్థుల్లో ఉన్న దుకాణాలు, ఆఫీస్ సముదాయాలను పరిశీలించి పనిచేయని కంప్యూటర్ సిస్టమ్స్, కీబోర్డ్స్ తదితర ఈ వేస్ట్ ఉంటే సంబంధిత ఐటీ వర్గాలకు అందించాలని సూచించారు. అలాగే ఉద్యోగులు కూడా తాము పనిచేసే పరిసరాల్లో కూడా శతశాతం శుభ్రంగా ఉండే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులు, సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ

85 చోరీ కేసుల్లో 112 మంది అరెస్టు : సీపీ



సమావేశంలో మాట్లాడుతూ పోలీసు కమిషనర్ శంకబ్రతా బాగ్చి

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన 85 చోరీ కేసులను ఛేదించి నేరాలకు పాల్పడిన 112 మంది నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలో చోరీల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటూనే... నమోదైన చోరీ కేసులను ప్రత్యేక శ్రద్ధతో ఛేదించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గతనెలలో జరిగిన మూడు దోపిడీలు, నాలుగు పగటిపూట ఇళ్లలో చోరీలు, రాత్రిపూట ఎనిమిది ఇళ్లలో జరిగిన దొంగతనాలు, నాలుగు చైన్ స్నాచింగ్‌లు, 21 మోటార్ సైకిళ్ల చోరీలు, 45 ఇతర చోరీలను ఛేదించామన్నారు. నిందితుల వద్ద నుంచి 1026.6 గ్రాముల బంగారం, 1.61 కిలోల వెండి, రూ.9.49 లక్షల నగదు, 22 బైకులు, 324 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఐదు మేకలు, ఐదు లారీల బ్యాటరీలను రికవరీ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.95.40 లక్షలు ఉంటుందని సీపీ వివరించారు. అనంతరం జరిగిన క్రైమ్ మేళాలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతులు మీదుగా అందజేశారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 24, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

క్రైస్తవులకు ఇన్‌చార్జి మంత్రి ఈస్టర్ శుభాకాంక్షలు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానవుల రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై బలియోగమై పునరుత్థానమైన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగ జరుపుకునే క్రైస్తవులందరికీ, విశాఖ ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజినేయస్వామి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునేదే ఈస్టర్ పండగ అని అన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.52,500 విలువ చేసే 10.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్ఐలు జి.కె.మీనా, కేటీఆర్ లక్ష్మి తమసిబ్బందితో శనివారం ప్లాట్ ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన బహారన్‌కుమార్‌అనే నిందితుడు గుజరాత్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతడి పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి



బీసీ స్టడీ సర్కిల్‌లో లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న కనకశేఖర్, సిబ్బంది

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా ఎంవీపీ కాలనీలోని గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొప్పిశెట్టి కనకశేఖర్, బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ సంఘం నాయకులు సూరిబాబు, దీప్తి, జీవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలను పారవేయాలి

- అవగాహన సదస్సులో 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు



అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పాడైపోయిన ఎలాక్ట్రానిక్ వస్తువులను ఇంట్లో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యపరంగా అనేక దుష్పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందని, అందుకే అలాంటి వస్తువులను చెత్తబుట్టకు పరిమితం చేయాలని జీవీఎంసీ 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు పేర్కొన్నారు. పెదగదిలి జంక్షన్‌లో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కొన్ని పాడైన ఎలక్ట్రానిక్స్ వస్తువులు కొన్నిసార్లు పేలిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే అలాంటి వస్తువులను ఇళ్లలో ఉంచవద్దని సూచించారు. అలాగే కాలిపోయిన బ్యాటరీలు పగులగొట్టడం చేయవద్దని, వాటి నుంచి విషతుల్య వాయువులు వెలువడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, శానిటేషన్ కార్యదర్శులు శ్రీకాంత్, సాయి అప్పారావు, అబ్దుల్ యాసిన్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఏయూ లా కళాశాలలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీపీ శంకబ్రత బాగ్చి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో శనివారం 'టౌన్‌హాల్ మీటింగ్ ఆన్ లా అండ్ ఆర్డర్ - అన్ ఇన్‌సైట్‌ఫుల్ ఫోరమ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం 'హక్కులు-బాధ్యతలు ', 'ది సైబర్ సైడ్ ఆఫ్ థింగ్స్', 'టుమారోస్ పోలీసింగ్', 'క్రైమ్ సీన్స్ అండ్ కంపారిసన్స్', 'సోషల్ మీడియా అండ్ పానిక్ మోడ్' తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జి.రాఘవయ్య, వి.రాజ్యలక్ష్మి, ఎ.పద్మావతి, ఎస్బీ చంద్రకళా, డాక్టర్ కె.పల్లవి న్యాయ సిట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నేత కృష్ణమూర్తికి నివాళి



కృష్ణమూర్తికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, స్వర్గీయ కృష్ణమూర్తి ఆదర్శమూర్తి అని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. శనివారం కృష్ణమూర్తిరెండో వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్ అధ్యక్షతన ఆరిలోవ టీబీసీ పాయింట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ..1984లో ఆరిలోవ కాలనీ ఏర్పడిన నాటి నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృష్ణమూర్తి అలుపెరగని పోరాటాలు చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందున్నారని కొనియాడారు. ఆరిలోవ ప్రజలకు ఇళ్ల పట్టాలు, ఈ ప్రాంతంలో రోడ్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్, జిలా కార్యదర్శి వర్గ సభ్యులు పి.మణి, జోన్ కార్యదర్శి కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యుడు అప్పలరాజు, జోన్ కమిటీ సభ్యులు డి.నాగరాజు, పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.చంటి, వి.అన్న పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపు లీకేజీకి సకాలంలో మరమ్మతు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ప్రధాన మంచి నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో శనివారం ఉదయానికి తాగునీరంతా వృథాగా రోడ్డుపై పోయింది. దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే జీవీఎంసీ వాటర్ విభాగం ఏఈ రహీమ్ స్పందించి హుటాహుటీన పైపులైన్ మరమ్మతు పనులను చేపట్టారు. పీ అండ్ టీ కాలనీలోని నీటి నిల్వ కేంద్రం నుంచి వచ్చే ప్రధాన పైపులైను దుర్గానగర్‌లోని నీటి నిల్వ ట్యాంక్‌లకు సరఫరా అవుతాయి. వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ ఈ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రోప్ స్కిప్పింగ్ మహిళా జట్టు ఎంపిక

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మహిళల రోప్ స్కిప్పింగ్ యూనివర్సిటీ జట్టు ఎంపిక జరిగింది. ఈ నెల 22నుంచి 24 వరకు రాజస్థాన్ మాధవ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఎ.పల్లవి తెలిపారు. జట్టు కోచ్‌గా ఎం.ఉదయ్ కుమార్ వ్యవహరిస్తారన్నారు. జట్టులో పి.రమ్య, ఎం.ఎస్.మాధవి, ఎల్వీ లక్ష్మి, సత్య డిగ్రీ కళాశాల వి.నందిని, సీహెచ్ విశాలాక్షి, ఎన్బీస్ అటానమస్ డిగ్రీ కళాశాల ఎం.శ్రీవల్లి, సత్య డిగ్రీ కళాశాల నుంచి ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పోటీలకు జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు.

టైలరింగ్ శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ



ఆరిలోవలో గల టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలో గల టైలరింగ్ శిక్షణ సెంటర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల బీసీ మహిళలకు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు ఇంట్లోనే ఉంటూ ఆదాయాన్ని సంపాదించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామికాభివృద్ధి కూడా సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. రోజుకు నాలుగు గంటల పాటు మూడు నెలలు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని ఆయన సూచించారు అలాగే వేపగుంట వద్ద గల చీమలవలసలో గల కాపు భవనం, సింహచలంలో గల మహాత్మా జ్యోతిబాయి పూలె బాలుర గరుకులాన్ని కూడా సందర్శించి అక్కడి పిల్లలు పొందుతున్న వసతులు గురించి ఆరా తీశారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత గురించి అడిగి తెలుసుకున్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం డి.హనుమంతరావు తదితరులు

సిరిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు (హాస్టల్ డివిజన్) మరోసారి విజయకేతనం ఎగురవేసినట్టు డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఆలిండియా ఫలితాల్లో వివిధ కేటగిరిలలో 100లోపు 2, 12, 16, 36, 42, 44, 72 ర్యాంకులతో పాటు వెయ్యిలోపు, విశాఖపట్నం నారాయణ హాస్టల్ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో పప్పల శ్రీహర్షవర్ధన్ 26వ ర్యాంకు, పీతల టీను ఆనంద్‌చక్రవర్తి 86వ ర్యాంకు, ఆటించయ్య పాండే 95వ ర్యాంకు, పూర్ణసాయి మామిడి 116, ఆరంగి సాత్విక్ 271, లక్కినేని సాయిప్రీతమ్ 326, తాళాబత్తుల మనోహర్ 328, ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం పెద్దిబొట్ల 461, పాట్నూరు కార్తీక్ 481, కొత్తకోట వెంకట అరవింద్‌కుమార్ 494, గౌతమ్ విజయకశ్యప్ తోటకూర 513, బోదల ఈశ్వర్‌తానూజ్ 521, ప్రభాస్ చంద్రసింగ్ 692, లక్ష్యజైన్ 732, పి.ప్రశాంత్ 818వ ర్యాంకులతో పాటు వందలోపు 3 ర్యాంకులు 500లోపు 10 ర్యాంకులు వెయ్యిలోపు 15 ర్యాంకులు సాధించారన్నారు. ఈ ర్యాంకులు సాధించడం వెనుక అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా విజయాలు సాధించగలిగామన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డీజీఎం డి.హనుమంతరావు, డీన్ పి.స్వరూప్ అభినందనలు తెలియజేశారు.

ధరిత్రి దినోత్సవంపై విద్యార్థులకు నేడు చిత్రలేఖన పోటీ

మాధవధార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మాధవధార కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ధరిత్రి దినోత్సవంపై బాలలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.వి.ముకుందరావు తెలిపారు. 7వ తరగతిలోపు విద్యార్థులు జూనియర్స్ కేటగిరీగా, ఇంటర్మీడియట్‌లోపు వారిని సీనియర్లుగా పరిగణిస్తూ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 'మనశక్తి-మనగ్రహం' అంశంపై చిత్రలేఖనం గీయాల్సి ఉంటుందన్నారు. డ్రాయింగ్ షీట్ మాత్రమే అందజేస్తామని, కలర్స్, ఎరేజర్, పెన్సిల్ విద్యార్థులే తమతో తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ సంస్థ ఈ పోటీల్ని చేపడుతుందని తెలిపారు. పాల్గొనే వారందరికీ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

దేవీశ్రీ ప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సంగీత కార్యక్రమాల పట్ల నగర ప్రజలు మక్కువ చూపుతారని, మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దేవీశ్రీ ప్రసాద్‌ను కలిసిన వారిలో ప్రముఖ డైరెక్టర్ మెహర్ రమేష్, జనసేన నాయకులు సునీల్, రఘు, సతీష్, శ్రీధర్, ఈశ్వరరావు, రాజేష్ తదితరులు ఉన్నారు.



దేవీశ్రీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

22న సీనియర్ సిటిజన్లకు ఉల్లాస కార్యక్రమాలు

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా ఎంజీటీ-2 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.కె. జోష్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో సహచర నిర్వాహకులు డాక్టర్ కె.రమప్రభ, ఎస్.వీరభద్రరావులతో కలిసి ఆయన మాట్లాడుతూ 22న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సీనియర్ సిటిజన్ల మీట్ గ్రీట్ ట్రీట్ కార్యక్రమం ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సుమారు నాలుగు వందల మంది ఈ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వాలీబాల్ జట్టు శిక్షణ శిబిరానికి ప్రశాంత్

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) సీనియర్ పురుషుల లీగ్-2025 టోర్నీకి ప్రకటించిన భారత జట్టు ప్రాబబుల్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ వాలీబాలర్ పి.ప్రశాంత్‌కు చోటుదక్కింది. జూన్ 4 నుంచి పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు ఈ నెల 25 నుంచి శిక్షణ ఇస్తారు. ఇందులో పాల్గొనాలని వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడహక్ కమిటీ శనివారం ప్రశాంత్‌కు సమాచారం పంపింది. ప్రశాంత్‌ను జీఎస్టీ, కస్టమ్స్ శాఖ అధికారులు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.



పురుషుల టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత పురుషుల టెన్నిస్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలోని టెన్నిస్ కోర్టులో జరుగుతున్న ఈ పోటీలకు వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. రైల్వే టెన్నిస్ ప్రతినిధులు రక్షణకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లలో సిగ్నల్ అండ్ టెలికాం శాఖ 2-0 స్కోరుతో టీఆర్డీపై, కమర్షియల్ శాఖ 2-0 స్కోరుతో ఆర్పీఎఫ్‌పై గెలుపొందాయి.

బాగా చదువుకుంటే మంచి అవకాశాలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు బాగా చదువుకుంటే జీవితంలో నిలదొక్కుకోవడానికి మంచి అవకాశాలు వస్తాయని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పాతజైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్సార్ నిధులతో వైశ్యరాజు జ్యూయలర్స్ నిర్మించిన కళావేదిక, హ్యాండ్‌వాష్ బేసిన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. కళాశాల విద్య ఎంతో పరిపూర్ణత సాధించే దిశ అన్నారు. తల్లిదండ్రుల కలలను నిలబెట్టాలని సూచించారు.గతంలో పాఠశాల సందర్శనకు వచ్చే సమయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, వైశ్యరాజు గిరి, వైశ్యరాజు నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను పతకాలతో ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హ్యాండ్‌వాష్ బేసిన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో దాతలు వైశ్యరాజ జ్యూయలర్స్ ప్రతినిధులు

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

సీతమ్మధార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రేటర్ విశాఖ 23వ వార్డు ఎస్ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని కాలనీలో ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ కమిషనర్ శివప్రసాద్ ర్యాలీకి జెండా ఊపారు. ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులతో కలిగే నష్టాలు, వాటి నిర్మూలన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్, టీవీ మెకానిక్, తుక్కు దుకాణాల వారికి, ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి ప్రమాదకరమైన వ్యర్థాలను విభజించాల్సిన అవసరాన్ని చెప్పారు. సహాయ వైద్యాధికారి దుర్గాప్రసాద్, శానటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

ఘనంగా జీవీఎంసీ పాఠశాల వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఎంఈవోలు రామారావు, బాలమణి హాజరై కేకు కోశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం ఆశాదేవి, ఎన్.వరలక్ష్మీ, ఆర్.లలితాంబ, మాధురి పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆశయాలకు తగిన విధంగా పాలించే దక్షత చంద్రబాబుకే సాధ్యమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను తెలుగుశక్తి ఆధ్వర్యంలో శనివారం దసపల్లా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. చంద్రబాబు వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటూ నినాదాలు చేశారు. బీవీ రామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేగి రాధాకృష్ణ, బి.దన్వి, లక్ష్మీభార్గవి, వీరభద్రరావు, కూర్మారావు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, వసంతరావు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ తగదు'

సీతంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న మావోయిస్టులు, ఆదివాసీల హత్యలను నిలిపివేయాలని సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏపీసీఎల్‌సీ ఆధ్వర్యంలో పౌర హక్కుల నేత ప్రొఫెసర్ కె.వి. సుబ్బారావు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన సోనిసోరి మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీల పిల్లలు, మహిళలు అని తేడా లేకుండా హతమారుస్తున్నారని ఆరోపించారు. బస్తర్‌లో ఆదివాసీలకు రక్షణ లేదని, నిత్యం ప్రాణభయంతో బతుకుతున్నారని పేర్కొన్నారు. అక్కడ ఆదివాసీలు బతకాలంటే పోలీసుల ఎదుట లొంగిపోయామని చెప్పాలని, లేదంటే చంపేస్తామని అంటున్నారని ఆమె పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకరించాలని, ప్రభుత్వాలు, మావోయిస్టులు చర్చలు జరపాలని కోరుతూ పౌర హక్కుల నేత సుబ్బారావు సదస్సు నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ హక్కుల కోసం సుబ్బారావు ఉద్యమించారని కొనియాడారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ నేత జె.వి.సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఉద్యమ సంస్థల నాయకులు చంద్రశేఖర్, లలిత, పద్మ, .చిన్నారావు, వెంకటేశ్వర్లు, వెంకటరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో పాల్గొన్న సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి, ప్రొఫెసర్ సుబ్బారావు, చిట్టిబాబు తదితరులు

మత సామరస్యాన్ని కాంక్షిస్తూ ర్యాలీ



సంఘీభావం ప్రకటిస్తున్న ఉడుముల బాలశౌరితో సెయింట్ జోసెఫ్ సిస్టర్లు

జ్ఞానాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాల మధ్య శాంతి, ఐక్యతను పెంపొందించడానికి నగరంలో శనివారం వివిధ వర్గాల క్రైస్తవ సంఘాలు నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమ ర్యాలీకి సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సిస్టర్లు మేరి, హేమ, డైసీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.మాణిక్యకుమారి, మాధురి, క్రైస్తవ విద్యార్థులు సంఘీభావం తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతపరమైన అసమ్మతి నెలకొన్న నేపథ్యంలో ఆదివారం ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు శాంతి, మత సామరస్య సందేశాన్ని ప్రకటిస్తూ ఈ ర్యాలీ చేపట్టారు. కాథలిక్ ఆర్చ్ బిషప్ ఉడుముల బాలశౌరి, వివిధ ప్రొటెస్టంట్ క్రైస్తవ వర్గాల బిషప్‌లు, ప్రముఖ చర్చిల పాస్టర్లు పెద్దసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

'సర్దార్ గౌతులచ్చన్న స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలి'

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడుగు వర్గాలకు సర్దార్ గౌతులచ్చన్న చేసిన సేవలు మరువలేనివని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు అన్నారు. శనివారం గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. షీలా నగర్ నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో గౌతులచ్చన్న స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని వాసుదేవరావు కోరారు. సభ్యులు బంటుపల్లి కృష్ణారావు, యాగంటి రవి, మడ్డి ప్రసాద్, బొంగు రాజారావు, మాగు బెహరా, శోభన్‌బాబు, లొట్టి వెంకటరమణ, డొంకాన రమేష్ పాల్గొన్నారు.



లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసుదేవరావు

మహిళా కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఆర్.మంజుల

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల బాధ్యతలు చేపట్టారు. భీమునిపట్నం ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. శనివారం పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ మంజులను అభినందించారు.

ఆలిండియా వర్సిటీ రోప్ స్కిప్పింగ్ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల రోప్ స్కిప్పింగ్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. రాజస్థాన్‌లోని మాధవ్ వర్సిటీలో జరిగే ఈ టోర్నీలో ఏయూ జట్టుకు పి.రమ్య, ఎం.ఎస్.మాధవి, ఎల్.వి.లక్ష్మి, వి.నందిని, సీహెచ్.విశాలాక్షి, ఎం.శ్రీవల్లి ప్రాతినిధ్యం వహించనుండగా, ఎం.ఉదయ్‌కుమార్ కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి శనివారం తన కార్యాలయంలో క్రీడాకారిణులను అభినందించి ఏయూకు పతకం అందించి ఖ్యాతి పెంచాలని ఆకాంక్షించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కంచరపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల విషయమై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్ రెడ్డి సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డి.నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధసేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పొందుతూ పనిచేస్తున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు ఎలా నివారించాలి? విపత్తుల సమయంలో ఉపయోగించవలసిన పరికరాల గురించి వివరించారు. ప్రమాదాలు జరిగేటప్పుడు సిబ్బందికి సమయస్ఫూర్తి అవసరమన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో విద్యుత్ పరికరాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జయంతి లక్ష్మయ్య వివరించారు. కార్యక్రమంలో సేఫ్టీ కరికులం కో-ఆర్డినేటర్ ఎ.వరహాలు, సీహెచ్ఎస్.ప్రసాద్, డి.తులసీరావు, జి.కనకయ్య, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్‌నిరంజన్ రెడ్డి

టీడీపీ సాధికార సమితి సమావేశం

కంచరపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డులో టీడీపీ నాయకులు శనివారం వార్డు సమావేశాన్ని సీనియర్ నాయకురాలు యాగాతి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఆదేశాలతో వార్డులో సాధికార సమితి సభ్యుల ఏర్పాటుపై చర్చించారు. ప్రతి 60 మంది ప్రజలకు ఒక సాధికార మిత్రను ఏర్పాటు చేయాలని, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. యూనిట్, బూత్ ఇన్‌చార్జుల నియామకంపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కమిటీ కృషిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో చెంగల శ్రీను, ఎస్.సత్యనారాయణరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

మేయర్ పీఠం కూటమి కైవసం

... 5వ పేజీ తరువాయి

గెలుచుకోవడంతో 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి మేయర్‌గా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు దాదాపు సగం మంది టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. దీంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూటమి నేతలు భావించారు. అయితే నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టాలన్న నిబంధన కారణంగా సాధ్యపడలేదు. గత నెల 18 నాటికి మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తవ్వడంతో 21న కూటమి కార్పొరేటర్లు 57 మంది సంతకాలతో మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దానిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 19న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కౌన్సిల్‌లో 2/3 వంతు సభ్యులు మద్దతు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు...మొత్తం 111 మంది ఓటుహక్కు కలిగినవారు ఉన్నారు. వీరిలో 2/3 వంతు అంటే 74 మంది అవిశ్వాసానికి మద్దతు తెలపాల్సి ఉంటుంది. అయితే నోటీస్ ఇచ్చే సమయానికి కూటమికి అంత బలం లేకపోవడంతో...తమ కార్పొరేటర్లను వైసీపీ నేతలు వెంటనే (గత నెల 23న) బెంగళూరు తరలించారు. అక్కడ నుంచి శ్రీలంక, కేరళ పర్యటనకు తీసుకువెళ్లారు. మరోవైపు కూటమి నేతలు తమ కార్పొరేటర్లను మలేషియా తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా?, వీగిపోతుందా?...అనే ఉత్కంఠ నెలకొంది. అయితే నాలుగు రోజుల కిందట వైసీపీ నేత బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లుగా ఉన్న తన భార్య, కోడలితో సహా జనసేనలో చేరిపోయారు. అదేవిధంగా గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కూడా జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 74కి పెరిగింది. కానీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడం, తమతో ఉన్న కార్పొరేటర్లకు వైసీపీ నేతలు గాలం వేస్తుండడంతో కూటమి నేతలు కంగారుపడ్డారు. ఎవరైనా వెళ్లిపోతే ఆ లోటును పూడ్చుకునేందుకు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి వరకూ హైడ్రామా నెలకొంది. చివరకు మలేషియాలో ఉన్న కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకోగా, వారిలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత తప్పించుకుని కేరళలోని వైసీపీ క్యాంపునకు చేరిపోయారు. మేజిక్ ఫిగర్ 74 అయితే తమ వద్ద 73 మంది మాత్రమే ఉండడంతో కూటమి నేతలు ఆందోళనకు గురయ్యారు. అయితే ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశానికి హాజరుకావడంతోపాటు మద్దతు తెలిపేలా ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు.

74 మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతు

కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జీవీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. కూటమి కార్పొరేటర్లంతా రెండు బస్సుల్లో నేరుగా హోటల్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సమావేశం ప్రారంభించడానికి అవసరమైన కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానాన్ని ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సభ్యులందరికీ చదివి వినిపించారు. మేయర్‌పై అవిశ్వాసానికి మద్దతు తెలిపేవారు చేతులు ఎత్తాలని కోరగా 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు చేతులు ఎత్తారు. వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉండేవారు చేతులు ఎత్తాలని కలెక్టర్ కోరగా, ఎవరూ చేతులు ఎత్తకపోవడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు కలెక్టర్ ప్రకటించారు. ఈ ప్రక్రియను నాలుగు వీడియో కెమెరాల్లో రికార్డు చేయించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి, మేయర్ పీఠం కూటమి వశం కావడంతో జీవీఎంసీ కార్యాలయం బయట కూటమి అభిమానులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

మేయర్‌గా పీలా శ్రీను?

... 5వ పేజీ తరువాయి

భీశెట్టి వసంతలక్ష్మి పేరు పరిశీలనకు వస్తుంది. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు మేయర్ పదవి దక్కినందున ఆమెకు అవకాశం ఉండదని నేతలు చెబుతున్నారు. అలాంటప్పుడు కొత్తగా పార్టీలో చేరిన కాపు సామాజిక వర్గానికి చెందిన 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేరు పరిశీలించే అవకాశం ఉంది. ఆమె తనవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఆమె ఇటీవలే వైసీపీ నుంచి వచ్చినందున మొదటి నుంచి జనసేన, టీడీపీల్లో ఉన్న కార్పొరేటర్లు అంగీకరించే పరిస్థితి ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటప్పుడు 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు పరిశీలనకు రావచ్చునని, అయితే సామాజిక వర్గాల సమీకరణాల్లో ఆయనకు అవకాశం దక్కడం కష్టమేనని జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత కూడా డిప్యూటీ మేయర్ పదవి కోసం ఆ పార్టీ నేతలపై ఒత్తిడి చేస్తున్నారు.

29న సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

అంతస్థులు (మొత్తం ఐదు అంతస్థులు) పార్కింగ్‌కు కేటాయించారు. వీటి విస్తీర్ణం 1.9 లక్షల చదరపు అడుగులు. వీటిలో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు కేటాయిస్తారు.

బీచ్‌రోడ్డులో హెలికాప్టర్ మ్యూజియం

తూర్పు నౌకాదళంతో కలిసి వీఎంఆర్‌డీఏ ఆర్‌కే బీచ్‌లో 'యుహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను మ్యూజియంగా మార్చింది. ఇది సీ హ్యారియర్ మ్యూజియానికి, టీయూ 142 మ్యూజియానికి మధ్యన ఉంటుంది. నేవీలో సేవల నుంచి విరమించిన హెలికాప్టర్‌ను తీసుకొచ్చి రూ.2.2 కోట్లతో మ్యూజియంగా మార్పు చేసింది. ఇది పూర్తయి మూడు నెలలు కావస్తోంది. దీనిని కూడా సీఎం చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఇంకా మరికొన్ని కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

మేయర్‌గా నాలుగేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అత్యున్నత హోదాలో నగర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. ప్రజారోగ్యం మెరుగుపరచడంతోపాటు గోశాల నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ నిర్మాణం పూర్తి, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ, బస్‌బేల నిర్మాణం తనకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసినప్పటికీ తనపై అవిశ్వాస తీర్మానం పెట్టడం కలచివేసిందన్నారు. తనకు సహకరించిన నగరవాసులు, అధికారులు, కార్పొరేటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 5వ పేజీ తరువాయి

మంది, 2000లోపు 200 మంది ర్యాంకులు సాధించారు. వచ్చే నెలలో జరగనున్న ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు వీరంతా అర్హులు అవుతారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే ఐఐటీలలో ప్రవేశాలు లభిస్తాయి. లేనిపక్షంలో జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా ఎన్ఐటీలు, ప్రముఖ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు దొరుకుతాయి.

ఉమ్మడి జిల్లాలో 1,139 టీచర్ పోస్టులు

... 5వ పేజీ తరువాయి

సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 65 ఖాళీలు ఉన్నాయి. వీటిలో తెలుగు 33, హిందీ 39, ఇంగ్లీష్ 55, గణితం 66, భౌతికశాస్త్రం 63, జీవశాస్త్రం 58, సాంఘిక శాస్త్రం 96, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 139 ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ ఖాళీలు మైదానంలో అన్ని యాజమాన్యాల పరిధిలో 239, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 335 ఖాళీలు ఉన్నాయి. మైదానం కంటే ఏజెన్సీలోనే ఎస్జీటీ ఖాళీలు ఉన్నాయని గుర్తించారు. కాగా నగరంలో జువెనైల్ సంక్షేమ శాఖ పరిధిలో బాలల కౌమార పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు నాలుగు, స్కూలు అసిస్టెంట్ పోస్టు ఒకటి వెరసి ఐదు ఉన్నాయి.

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్

... 5వ పేజీ తరువాయి

తర్లువాడలో మరో డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేస్తుందని, దీంతో విశాఖపట్నం పెద్ద డేటా సెంటర్‌గా మారనుందని గంటా వెల్లడించారు.

విశాఖలో సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ సెంటర్

డేటా సెంటర్ నిర్వహించాలంటే అత్యంత వేగవంతమైన 'స్పీడ్ ఇంటర్నెట్' అవసరం. దీనికి అవసరమైన కేబుల్‌ను ల్యాండ్ లైన్ ద్వారా కాకుండా సముద్ర గర్భం నుంచి తీసుకువస్తారు. దీనిని 'సబ్‌మెరైన్ కేబుల్'గా వ్యవహరిస్తారు. సింగపూర్ నుంచి తీసుకువచ్చే ఈ లైన్‌కు విశాఖపట్నంలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (సీఎల్ఎస్) ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దేశంలో ఇలాంటి స్టేషన్లు ఇప్పటికే ముంబై, చెన్నై, కొచ్చిన్, టుటికోరిన్, త్రివేంద్రంలలో ఉన్నాయి. కొత్తగా విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వల్ల ఇక్కడ అదానీ, గూగుల్ సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకువచ్చాయి.

వైఎంసీఏలో 26 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని వైఎంసీఏలో ఈ నెల 26 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ రెవరెండ్ జి.స్టెవిన్ పీటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 38 శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ నెల 26 నుంచి మే 31 వరకు 5 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయస్సు విద్యార్థులకు శిబిరంలో ప్రవేశం ఉంటుందన్నారు. అబాకస్/ఎంఎ, ఎరోబిక్స్, ఎయిర్ గన్ రైఫిల్ షూటింగ్, కాలిగ్రాఫ్, చెస్, క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, జూడో, కరాటే, మ్యూజిక్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, జూడో సెల్ఫ్ డిఫెన్స్, యోగ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.


ఏయూలో పరిసరాలు శుభ్రపరుస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఏయూ అధికారులు, విద్యార్థులు


విమ్స్‌లో వైద్యులు, సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు



వెంకోజీపాలెం : పరిశుభ్రం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

స్వచ్ఛత నిత్యకృత్యం కావాలి

- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో వక్తల సూచన
- పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పలు వార్డుల్లో చెత్తాచెదారాల తొలగింపు
- పాడైన ఎలక్ట్రానిక్ పరికరాల ఏరివేత

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతను ఒక అలవాటుగా చేసుకోవాలని, అప్పుడే మార్పు సాధ్యపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. శనివారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కళాశాల పరిసరాలలోని వ్యర్థాలను తొలగించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్వీయ క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ముఖ్యంగా.. ప్రజల్లో స్వచ్ఛత పట్ల అవగాహన పెంచడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంతో అవసరమన్నారు. భవిష్యత్తు అధ్యాపకులుగా మారే మీరంతా పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించాలని సూచించారు. ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో స్వచ్ఛతను ఒక అలవాటుగా మారుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. కార్యక్రయంలో విభాగాధిపతి టి.షారోన్ రాజు, డాక్టర్ ప్రకాష్‌రావు, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో వైద్యులు, సిబ్బంది శనివారం పరిసరాలు శుభ్రపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను శుభ్రం చేశారు. కంప్యూటర్లు, ఫ్యాన్లు, సర్జరీ యంత్రాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల్లో విష పదార్థాలు ఉంటాయన్నారు. అందుకే వీటిని ఎప్పటికప్పుడు పారవేయాలని సూచించారు. వీటిని ఎక్కడ పడితే అక్కడ పారవేయకూడదన్నారు. చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదరకంగా కనిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికరాల పై కలిగే అనర్థాలపై తీసిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర మన అందరి కర్తవ్యమని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. శనివారం ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం వలంటీర్లు వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్

సిరిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ వ్యర్థాల సేకరణ, రీ సైకింగ్‌కు అనుగుణంగా వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ ఉద్యోగ భవన్ కాంప్లెక్స్‌లోని అన్ని అంతస్థుల్లో ఉన్న దుకాణాలు, ఆఫీస్ సముదాయాలను పరిశీలించి పనిచేయని కంప్యూటర్ సిస్టమ్స్ కీబోర్డ్స్ తదితర ఈ వేస్ట్ ఉంటే సంబంధిత ఐటీ వర్గాలకు అందించాలని సూచించారు. అలాగే ఉద్యోగులు కూడా తాము పనిచేసే పరిసరాల్లో కూడా శతశాతం శుభ్రంగా ఉండే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగులు, సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ

టైలరింగ్ శిక్షణతో మహిళకు ఆర్థిక భరోసా

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ


ఆరిలోవలో గల టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలో గల టైలరింగ్ శిక్షణ సెంటర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల బీసీ మహిళలకు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు ఇంట్లోనే ఉంటూ ఆదాయాన్ని సంపాదించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. భవిషత్తులో పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామికాభివృద్ధి కూడా సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. రోజుకు నాలుగు గంటల పాటు మూడు నెలలు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ ఆవకావాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని ఆయన సూచించారు అలాగే వేపగుంట వద్ద గల చీమలవలసలో గల కాపు భవనం, సింహచలంలో గల మహాత్మా జ్యోతిబాయి పూలె బాలుర గరుకులాన్ని కూడా సందర్శించి అక్కడి పిల్లలు పొందుతున్న వసతులు గురించి ఆరా తీశారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత గురించి అడిగి తెలుసుకున్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం డి.హనుమంతరావు తదితరులు

సిరిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు (హాస్టల్ డివిజన్) మరోసారి విజయకేతనం ఎగురవేసినట్టు డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఆలిండియా ఫలితాల్లో వివిధ కేటగిరిలలో 100లోపు 2, 12, 16, 36, 42, 44, 72 ర్యాంకులతో పాటు వెయ్యిలోపు, విశాఖపట్నం నారాయణ హాస్టల్ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో పప్పల శ్రీహర్ష వర్ధన్ 26వ ర్యాంకు, పీతల టీను ఆనంద్‌చక్రవర్తి 86వ ర్యాంకు, ఆటించయ్య పాండే 95వ ర్యాంకు, పూర్ణసాయి మామిడి 116, ఆరంగి సాత్విక్ 271, లక్కినేని సాయిప్రీతమ్ 326, తాళాబత్తుల మనోహర్ 328, ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం పెద్దిబొట్ల 461, పాట్నూరు కార్తీక్ 481, కొత్తకోట వెంకట అరవింద్‌కుమార్ 494, గౌతమ్ విజయకశ్యప్ తోటకూర 513, బోదల ఈశ్వర్‌తానూజ్ 521, ప్రభాస చంద్రసింగ్ 692, లక్ష్యజైన్ 732, పి.ప్రశాంత్ 818వ ర్యాంకులతో పాటు వందలోపు 3 ర్యాంకులు 500లోపు 10 ర్యాంకులు వెయ్యిలోపు 15 ర్యాంకులు సాధించారన్నారు. ఈ ర్యాంకులు సాధించడం వెనుక అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా విజయాలు సాధించగలిగామన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డీజీఎం డి.హనుమంతరావు, డీన్ పి.స్వరూప్ అభినందనలు తెలియజేశారు.

85 చోరీ కేసుల్లో 112 మంది అరెస్టు : సీపీ


సమావేశంలో మాట్లాడుతూ పోలీసు కమిషనర్ శంకబ్రతా బాగ్చి

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన 85 చోరీ కేసులను ఛేదించి నేరాలకు పాల్పడిన 112 మంది నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలో చోరీల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటూనే... నమోదైన చోరీ కేసులను ప్రత్యేక శ్రద్ధతో ఛేదించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గతనెలలో జరిగిన మూడు దోపిడీలు, నాలుగు పగటిపూట ఇళ్లలో చోరీలు, రాత్రిపూట ఎనిమిది ఇళ్లలో జరిగిన దొంగతనాలు, నాలుగు చైన్ స్నాచింగ్‌లు, 21 మోటార్ సైకిళ్ల చోరీలు, 45 ఇతర చోరీలను ఛేదించామన్నారు. నిందితుల వద్ద నుంచి 1026.6 గ్రాముల బంగారం, 1.61 కిలోల వెండి, రూ.9.49 లక్షల నగదు, 22 బైకులు, 324 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఐదు మేకలు, ఐదు లారీల బ్యాటరీలను రికవరీ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.95.40 లక్షలు ఉంటుందని సీపీ వివరించారు. అనంతరం జరిగిన క్రైమ్ మేళాలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతులు మీదుగా అందజేశారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలను పారవేయాలి

- అవగాహన సదస్సులో 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు



అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పాడైపోయిన ఎలాక్ట్రానిక్ వస్తువులను ఇంట్లో ఉంచుకోవడం వల్ల ఆరోగ్య పరంగా అనేక దుష్పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందని, అందుకే అలాంటి వస్తువులను చెత్త బుట్టకు పరిమితం చేయాలని జీవీఎంసీ 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు పేర్కొన్నారు. పెదగదిలి జంక్షన్‌లో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కొన్ని పాడైన ఎలక్ట్రానిక్స్ వస్తువులు కొన్నిసార్లు పేలిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే అలాంటి వస్తువులను ఇళ్లలో ఉంచవద్దని సూచించారు. అలాగే కాలిపోయిన బ్యాటరీలు పగులగొట్టడం చేయవద్దని, వాటి నుంచి విషతుల్య వాయువులు వెలువడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, శానిటేషన్ కార్యదర్శులు శ్రీకాంత్, సాయి అప్పారావు, అబ్దుల్ యాసిన్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఏయూ లా కళాశాలలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీపీ శంకబ్రత బాగ్చి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో శనివారం 'టౌన్‌హాల్ మీటింగ్ ఆన్ లా అండ్ ఆర్డర్ - అన్ ఇన్‌సైట్‌ఫుల్ ఫోరమ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం 'హక్కులు-బాధ్యతలు', 'ది సైబర్ సైడ్ ఆఫ్ థింగ్స్', 'టుమారోస్ పోలీసింగ్, 'క్రైమ్ సీన్స్ అండ్ కంపారిసన్స్', 'సోషల్ మీడియా అండ్ పానిక్ మోడ్' తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జి.రాఘవయ్య, వి.రాజ్యలక్ష్మి, ఎ.పద్మావతి, ఎన్వీ చంద్రకళా, డాక్టర్ కె.పల్లవి న్యాయ సెట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నేత కృష్ణమూర్తికి నివాళి


కృష్ణమూర్తికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఆరిలోవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, స్వర్గీయ కృష్ణమూర్తి ఆదర్శమూర్తి అని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. శనివారం కృష్ణమూర్తిరెండో వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్ అధ్యక్షతన ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ..1984లో ఆరిలోవ కాలనీ ఏర్పడిన నాటి నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృష్ణమూర్తి అలుపెరగని పోరాటాలు చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందున్నారని కొనియాడారు. ఆరిలోవ ప్రజలకు ఇళ్ల పట్టాలు, ఈ ప్రాంతంలో రోడ్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్, జిలా కార్యదర్శి వర్గ సభ్యులు పి.మణి, జోన్ కార్యదర్శి కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యుడు అప్పలరాజు, జోన్ కమిటీ సభ్యులు డి.నాగరాజు, పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.చంటి, వి.అన్న పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపు లీకేజీకి సకాలంలో మరమ్మతు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ప్రధాన మంచి నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పరడంతో శనివారం ఉదయానికి తాగునీరంతా వృథాగా రోడ్డుపై పోయింది. దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే జీవీఎంసీ వాటర్ విభాగం ఏఈ రహీమ్ స్పందించి హుటాహుటీన పైపులైన్ మరమ్మతు పనులను చేపట్టారు. పీ అండ్ టీ కాలనీలోని నీటి నిల్వ కేంద్రం నుంచి వచ్చే ప్రధాన పైపులైను దుర్గానగర్‌లోని నీటి నిల్వ ట్యాంక్‌లకు సరఫరా అవుతాయి. వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ ఈ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రోప్ స్కిప్పింగ్ మహిళా జట్టు ఎంపిక

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మహిళల రోప్ స్కిప్పింగ్ యూనివర్సిటీ జట్టు ఎంపిక జరిగింది. ఈ నెల 22నుంచి 24 వరకు రాజస్థాన్ మాధవ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఎ.పల్లవి తెలిపారు. జట్టు కోచ్‌గా ఎం.ఉదయ్ కుమార్ వ్యవహరిస్తారన్నారు. జట్టులో పి.రమ్య, ఎం.ఎస్.మాధవి, ఎల్వీ లక్ష్మి, సత్య డిగ్రీ కళాశాల వి.నందిని, సీహెచ్ విశాలాక్షి, ఎన్బీస్ అటానమస్ డిగ్రీ కళాశాల ఎం.శ్రీవల్లి, సత్య డిగ్రీ కళాశాల నుంచి ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పోటీలకు జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 24, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

క్రైస్తవులకు ఇన్‌చార్జి మంత్రి ఈస్టర్ శుభాకాంక్షలు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానవుల రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై బలియోగమై పునరుత్థానమైన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగ జరుపుకునే క్రైస్తవులందరికీ, విశాఖ ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజినేయస్వామి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునేదే ఈస్టర్ పండగ అని అన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.52,500 విలువ చేసే 10.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్ఐలు జి.కె.మీనా, కేటీఆర్ లక్ష్మి తమసిబ్బందితో శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన బహారన్‌కుమార్‌అనే నిందితుడు గుజరాత్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతడి పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి


బీసీ స్టడీ సర్కిల్‌లో లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న కనకశేఖర్, సిబ్బంది

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా ఎంవీపీ కాలనీలోని గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొప్పిశెట్టి కనకశేఖర్, బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ సంఘం నాయకులు సూరిబాబు, దీప్తి, జీవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ధరిత్రి దినోత్సవంపై విద్యార్థులకు నేడు చిత్రలేఖన పోటీ

మాధవధార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మాధవధార కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ధరిత్రి దినోత్సవంపై బాలలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.వి.ముకుందరావు తెలిపారు. 7వ తరగతిలోపు విద్యార్థులు జూనియర్స్ కేటగిరీగా, ఇంటర్మీడియట్‌లోపు వారిని సీనియర్లుగా పరిగణిస్తూ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 'మనశక్తి-మనగ్రహం' అంశంపై చిత్రలేఖనం గీయాల్సి ఉంటుందన్నారు. డ్రాయింగ్ షీట్ మాత్రమే అందజేస్తామని, కలర్స్, ఎరేజర్, పెన్సిల్ విద్యార్థులే తమతో తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ సంస్థ ఈ పోటీల్ని చేపడుతుందని తెలిపారు. పాల్గొనే వారందరికీ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

దేవీశ్రీ ప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సంగీత కార్యక్రమాల పట్ల నగర ప్రజలు మక్కువ చూపుతారని, మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దేవీశ్రీ ప్రసాద్‌ను కలిసిన వారిలో ప్రముఖ డైరెక్టర్ మెహర్ రమేష్, జనసేన నాయకులు సునీల్, రఘు, సతీష్, శ్రీధర్, ఈశ్వరరావు, రాజేష్ తదితరులు ఉన్నారు.



దేవీశ్రీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

22న సీనియర్ సిటిజన్లకు ఉల్లాస కార్యక్రమాలు

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా ఎంజీటీ-2 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.కె. జోష్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో సహచర నిర్వాహకులు డాక్టర్ కె.రమప్రభ, ఎస్.వీరభద్రరావులతో కలిసి ఆయన మాట్లాడుతూ 22న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సీనియర్ సిటిజన్ల మీట్ గ్రీట్ ట్రీట్ కార్యక్రమం ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సుమారు నాలుగు వందల మంది ఈ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వాలీబాల్ జట్టు శిక్షణ శిబిరానికి ప్రశాంత్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) సీనియర్ పురుషుల లీగ్-2025 టోర్నీకి ప్రకటించిన భారత జట్టు ప్రాబబుల్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ వాలీబాలర్ పి.ప్రశాంత్‌కు చోటుదక్కింది. జూన్ 4 నుంచి పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు ఈ నెల 25 నుంచి శిక్షణ ఇస్తారు. ఇందులో పాల్గొనాలని వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడహక్ కమిటీ శనివారం ప్రశాంత్‌కు సమాచారం పంపింది. ప్రశాంత్‌ను జీఎస్టీ, కస్టమ్స్ శాఖ అధికారులు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.



పురుషుల టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత పురుషుల టెన్నిస్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. రైల్వే స్పోర్ట్సు ఎరీనాలోని టెన్నిస్ కోర్టులో జరుగుతున్న ఈ పోటీలకు వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. రైల్వే టెన్నిస్ ప్రతినిధులు రక్షణకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లలో సిగ్నల్ అండ్ టెలికాం శాఖ 2-0 స్కోరుతో టీఆర్డీపై, కమర్షియల్ శాఖ 2-0 స్కోరుతో ఆర్పీఎఫ్‌పై గెలుపొందాయి.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన

తగరపువలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు కృషి, పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలని విజయనగరం జేఎన్‌టీయూ డైరెక్టర్ డా. టి.స్వామినాయుడు అన్నారు. తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల సందర్శన, వర్క్‌షాప్, ఇంటర్న్‌షిప్ వంటివి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని చెప్పారు. కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు కోడి సునీల్, అంబారికొండ చిరంజీవి, సింగంపల్లి వాసు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ రాజు, గోవిందరావు, ప్లేస్‌మెంటు అధికారులు టి.శ్రీనివాసరావు, రూప్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

మే 25న పీహెచ్‌డీలో ప్రవేశాలకు పరీక్ష

సాగర్‌నగర్/ఎండాడ, (ఆంధ్రజ్యోతి): గీతం యూనివర్సిటీలో పీహెచ్‌డీలో ప్రవేశా లకు మే 25న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించను న్నారు. విశాఖ, హైదరాబాద్, బెంగళూరులో ఉన్న క్యాంపస్‌లలో పలు విభాగాల్లో పీహెచ్ డీలో ప్రవేశాలకు గాను ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు గీతం రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ వి. నందూరి తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మసీ విభాగానికి జూన్ 1న పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల్లో ఎంపికైన వారికి జూన్ 5 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు.

బాగా చదువుకుంటేనే మంచి అవకాశాలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు బాగా చదువుకుంటే జీవితంలో నిలదొక్కుకోవడానికి మంచి అవకాశాలు వస్తాయని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పాతజైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్సార్ నిధులతో వైశ్యరాజు జ్యూయలర్స్ నిర్మించిన కళావేదిక, హ్యాండ్‌వాష్ బేసిన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. కళాశాల విద్య ఎంతో పరిపూర్ణత సాధించే దిశ అన్నారు. తల్లిదండ్రుల కలలను నిలబెట్టాలని సూచించారు.గతంలో పాఠశాల సందర్శనకు వచ్చే సమయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, వైశ్యరాజు గిరి, వైశ్యరాజు నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను పతకాలతో ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హ్యాండ్‌వాష్ బేసిన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో దాతలు వైశ్యరాజ జ్యూయలర్స్ ప్రతినిధులు

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

సీతమ్మధార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రేటర్ విశాఖ 23వ వార్డు ఎస్ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని కాలనీలో ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ కమిషనర్ శివప్రసాద్ ర్యాలీకి జెండా ఊపారు. ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులతో కలిగే నష్టాలు, వాటి నిర్మూలన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్, టీవీ మెకానిక్, తుక్కు దుకాణాల వారికి, ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి ప్రమాదకరమైన వ్యర్థాలను విభజించాల్సిన అవసరాన్ని చెప్పారు. సహాయ వైద్యాధికారి దుర్గాప్రసాద్, శానటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

ఘనంగా జీవీఎంసీ పాఠశాల వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఎంఈవోలు రామారావు, బాలమణి హాజరై కేకు కోశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం ఆశాదేవి, ఎన్.వరలక్ష్మీ, ఆర్.లలితాంబ, మాధురి పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆశయాలకు తగిన విధంగా పాలించే దక్షత చంద్రబాబుకే సాధ్యమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను తెలుగుశక్తి ఆధ్వర్యంలో శనివారం దసపల్లా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. చంద్రబాబు వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటూ నినాదాలు చేశారు. బీవీ రామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేగి రాధాకృష్ణ, బి.దన్ని, లక్ష్మీభార్గవి, వీరభద్రరావు, కూర్మారావు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, వసంతరావు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ తగదు'

సీతంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న మావోయిస్టులు, ఆదివాసీల హత్యలను నిలిపివేయాలని సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏపీసీఎల్‌సీ ఆధ్వర్యంలో పౌర హక్కుల నేత ప్రొఫెసర్ కె.వి. సుబ్బారావు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన సోనిసోరి మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీల పిల్లలు, మహిళలు అని తేడా లేకుండా హతమారుస్తున్నారని ఆరోపించారు. బస్తర్‌లో ఆదివాసీలకు రక్షణ లేదని, నిత్యం ప్రాణభయంతో బతుకుతున్నారని పేర్కొన్నారు. అక్కడ ఆదివాసీలు బతకాలంటే పోలీసుల ఎదుట లొంగిపోయామని చెప్పాలని, లేదంటే చంపేస్తామని అంటున్నారని ఆమె పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకరించాలని, ప్రభుత్వాలు, మావోయిస్టులు చర్చలు జరపాలని కోరుతూ పౌర హక్కుల నేత సుబ్బారావు సదస్సు నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ హక్కుల కోసం సుబ్బారావు ఉద్యమించారని కొనియాడారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ నేత జె.వి.సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఉద్యమ సంస్థల నాయకులు చంద్రశేఖర్, లలిత, పద్మ, .చిన్నారావు, వెంకటేశ్వర్లు, వెంకటరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో పాల్గొన్న సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి, ప్రొఫెసర్ సుబ్బారావు, చిట్టిబాబు తదితరులు

మత సామరస్యాన్ని కాంక్షిస్తూ ర్యాలీ



సంఘీభావం ప్రకటిస్తున్న ఉడుమల బాలశౌరితో సెయింట్ జోసెఫ్ సిస్టర్లు

జ్ఞానాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాల మధ్య శాంతి, ఐక్యతను పెంపొందించడానికి నగరంలో శనివారం వివిధ వర్గాల క్రైస్తవ సంఘాలు నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమ ర్యాలీకి సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సిస్టర్లు మేరి, హేమ, డైసీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.మాణిక్యకుమారి, మాధురి, క్రైస్తవ విద్యార్థులు సంఘీభావం తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతపరమైన అసమ్మతి నెలకొన్న నేపథ్యంలో ఆదివారం ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు శాంతి, మత సామరస్య సందేశాన్ని ప్రకటిస్తూ ఈ ర్యాలీ చేపట్టారు. కాథలిక్ ఆర్చ్ బిషప్ ఉడుమల బాలశౌరి, వివిధ ప్రొటెస్టంట్ క్రైస్తవ వర్గాల బిషప్‌లు, ప్రముఖ చర్చిల పాస్టర్లు పెద్దసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

'సర్దార్ గౌతులచ్చన్న స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలి'

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడుగు వర్గాలకు సర్దార్ గౌతులచ్చన్న చేసిన సేవలు మరువలేనివని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు అన్నారు. శనివారం గౌతులచ్చన్న వర్ధంతి సందర్భంగా జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పీలా నగర్ నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో గౌతులచ్చన్న స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని వాసుదేవరావు కోరారు. సభ్యులు బంటుపల్లి కృష్ణారావు, యాగంటి రవి, మడ్డి ప్రసాద్, బొంగు రాజారావు, మాగు బెహరా, శోభన్‌బాబు, లొట్టి వెంకటరమణ, డొంకాన రమేష్ పాల్గొన్నారు.



లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసుదేవరావు

మహిళా కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఆర్.మంజుల

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆర్.మంజుల బాధ్యతలు చేపట్టారు. భీమునిపట్నం ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ, ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. శనివారం పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ మంజులను అభినందించారు.

ఆలిండియా వర్సిటీ రోప్ స్కిప్పింగ్ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల రోప్ స్కిప్పింగ్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. రాజస్థాన్‌లోని మాధవ్ వర్సిటీలో జరిగే ఈ టోర్నీలో ఏయూ జట్టుకు పి.రమ్య, ఎం.ఎస్.మాధవి, ఎల్.వి.లక్ష్మి, వి.నందిని, సీహెచ్.విశాలాక్షి, ఎం.శ్రీవల్లి ప్రాతినిధ్యం వహించనుండగా, ఎం.ఉదయ్‌కుమార్ కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి శనివారం తన కార్యాలయంలో క్రీడాకారిణులను అభినందించి ఏయూకు పతకం అందించి ఖ్యాతి పెంచాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కంచరపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల విషయమై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్ రెడ్డి సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డి.నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధసేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పొందుతూ పనిచేస్తున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు ఎలా నివారించాలి? విపత్తుల సమయంలో ఉపయోగించవలసిన పరికరాల గురించి వివరించారు. ప్రమాదాలు జరిగేటప్పుడు సిబ్బందికి సమయస్ఫూర్తి అవసరమన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో విద్యుత్ పరికరాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జయంతి లక్ష్మయ్య వివరించారు. కార్యక్రమంలో సేఫ్టీ కరికులం కో-ఆర్డినేటర్ ఎ.వరహాలు, సీహెచ్ఎస్.ప్రసాద్, డి.తులసీరావు, జి.కనకయ్య, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్‌నిరంజన్ రెడ్డి

టీడీపీ సాధికార సమితి సమావేశం

కంచరపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డులో టీడీపీ నాయకులు శనివారం వార్డు సమావేశాన్ని సీనియర్ నాయకురాలు యాగాతి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఆదేశాలతో వార్డులో సాధికార సమితి సభ్యుల ఏర్పాటుపై చర్చించారు. ప్రతి 60 మంది ప్రజలకు ఒక సాధికార మిత్రను ఏర్పాటు చేయాలని, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. యూనిట్, బూత్ ఇన్‌చార్జుల నియామకంపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కమిటీ కృషిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో చెంగల శ్రీను, ఎస్.సత్యనారాయణరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

మేయర్ పీఠం కూటమి కైవసం

... 5వ పేజీ తరువాయి

గెలుచుకోవడంతో 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి మేయర్‌గా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు దాదాపు సగం మంది టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. దీంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూటమి నేతలు భావించారు. అయితే నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టాలన్న నిబంధన కారణంగా సాధ్యపడలేదు. గత నెల 18 నాటికి మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తవ్వడంతో 21న కూటమి కార్పొరేటర్లు 57 మంది సంతకాలతో మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దానిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 19న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కౌన్సిల్‌లో 2/3 వంతు సభ్యులు మద్దతు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు...మొత్తం 111 మంది ఓటుహక్కు కలిగినవారు ఉన్నారు. వీరిలో 2/3 వంతు అంటే 74 మంది అవిశ్వాసానికి మద్దతు తెలపాల్సి ఉంటుంది. అయితే నోటీస్ ఇచ్చే సమయానికి కూటమికి అంత బలం లేకపోవడంతో...తమ కార్పొరేటర్లను వైసీపీ నేతలు వెంటనే (గత నెల 23న) బెంగళూరు తరలించారు. అక్కడ నుంచి శ్రీలంక, కేరళ పర్యటనకు తీసుకువెళ్లారు. మరోవైపు కూటమి నేతలు తమ కార్పొరేటర్లను మలేషియా తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా?, వీగిపోతుందా?...అనే ఉత్కంఠ నెలకొంది. అయితే నాలుగు రోజుల కిందట వైసీపీ నేత బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లుగా ఉన్న తన భార్య, కోడలితో సహా జనసేనలో చేరిపోయారు. అదేవిధంగా గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కూడా జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 74కి పెరిగింది. కానీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడం, తమతో ఉన్న కార్పొరేటర్లకు వైసీపీ నేతలు గాలం వేస్తుండడంతో కూటమి నేతలు కంగారుపడ్డారు. ఎవరైనా వెళ్లిపోతే ఆ లోటును పూడ్చుకునేందుకు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి వరకూ హైడ్రామా నెలకొంది. చివరకు మలేషియాలో ఉన్న కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకోగా, వారిలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత తప్పించుకుని కేరళలోని వైసీపీ క్యాంపునకు చేరిపోయారు. మేజిక్ ఫిగర్ 74 అయితే తమ వద్ద 73 మంది మాత్రమే ఉండడంతో కూటమి నేతలు ఆందోళనకు గురయ్యారు. అయితే ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశానికి హాజరుకావడంతోపాటు మద్దతు తెలిపేలా ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు.

74 మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతు

కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జీవీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. కూటమి కార్పొరేటర్లంతా రెండు బస్సుల్లో నేరుగా హోటల్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సమావేశం ప్రారంభించడానికి అవసరమైన కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానాన్ని ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సభ్యులందరికీ చదివి వినిపించారు. మేయర్‌పై అవిశ్వాసానికి మద్దతు తెలిపేవారు చేతులు ఎత్తాలని కోరగా 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు చేతులు ఎత్తారు. వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉండేవారు చేతులు ఎత్తాలని కలెక్టర్ కోరగా, ఎవరూ చేతులు ఎత్తకపోవడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు కలెక్టర్ ప్రకటించారు. ఈ ప్రక్రియను నాలుగు వీడియో కెమెరాల్లో రికార్డు చేయించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి, మేయర్ పీఠం కూటమి వశం కావడంతో జీవీఎంసీ కార్యాలయం బయట కూటమి అభిమానులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

మేయర్‌గా పీలా శ్రీను?

... 5వ పేజీ తరువాయి

భీశెట్టి వసంతలక్ష్మి పేరు పరిశీలనకు వస్తుంది. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు మేయర్ పదవి దక్కినందున ఆమెకు అవకాశం ఉండదని నేతలు చెబుతున్నారు. అలాంటప్పుడు కొత్తగా పార్టీలో చేరిన కాపు సామాజిక వర్గానికి చెందిన 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేరు పరిశీలించే అవకాశం ఉంది. ఆమె తనవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఆమె ఇటీవలే వైసీపీ నుంచి వచ్చినందున మొదటి నుంచి జనసేన, టీడీపీల్లో ఉన్న కార్పొరేటర్లు అంగీకరించే పరిస్థితి ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటప్పుడు 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు పరిశీలనకు రావచ్చునని, అయితే సామాజిక వర్గాల సమీకరణాల్లో ఆయనకు అవకాశం దక్కడం కష్టమేనని జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత కూడా డిప్యూటీ మేయర్ పదవి కోసం ఆ పార్టీ నేతలపై ఒత్తిడి చేస్తున్నారు.

29న సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

అంతస్థులు (మొత్తం ఐదు అంతస్థులు) పార్కింగ్‌కు కేటాయించారు. వీటి విస్తీర్ణం 1.9 లక్షల చదరపు అడుగులు. వీటిలో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు కేటాయిస్తారు.

బీచ్‌రోడ్డులో హెలికాప్టర్ మ్యూజియం

తూర్పు నౌకాదళంతో కలిసి వీఎంఆర్‌డీఏ ఆర్‌కే బీచ్‌లో 'యుహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను మ్యూజియంగా మార్చింది. ఇది సీ హ్యారియర్ మ్యూజియానికి, టీయూ 142 మ్యూజియానికి మధ్యన ఉంటుంది. నేవీలో సేవల నుంచి విరమించిన హెలికాప్టర్‌ను తీసుకొచ్చి రూ.2.2 కోట్లతో మ్యూజియంగా మార్పు చేసింది. ఇది పూర్తయి మూడు నెలలు కావస్తోంది. దీనిని కూడా సీఎం చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఇంకా మరికొన్ని కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

మేయర్‌గా నాలుగేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అత్యున్నత హోదాలో నగర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. ప్రజారోగ్యం మెరుగుపరచడంతోపాటు గోశాల నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ నిర్మాణం పూర్తి, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ, బస్‌బేల నిర్మాణం తనకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసినప్పటికీ తనపై అవిశ్వాస తీర్మానం పెట్టడం కలచివేసిందన్నారు. తనకు సహకరించిన నగరవాసులు, అధికారులు, కార్పొరేటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 5వ పేజీ తరువాయి

మంది, 2000లోపు 200 మంది ర్యాంకులు సాధించారు. వచ్చే నెలలో జరగనున్న ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు వీరంతా అర్హులు అవుతారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే ఐఐటీలలో ప్రవేశాలు లభిస్తాయి. లేనిపక్షంలో జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా ఎన్ఐటీలు, ప్రముఖ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు దొరుకుతాయి.

ఉమ్మడి జిల్లాలో 1,139 టీచర్ పోస్టులు

... 5వ పేజీ తరువాయి

సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 65 ఖాళీలు ఉన్నాయి. వీటిలో తెలుగు 33, హిందీ 39, ఇంగ్లీష్ 55, గణితం 66, భౌతికశాస్త్రం 63, జీవశాస్త్రం 58, సాంఘిక శాస్త్రం 96, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 139 ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ ఖాళీలు మైదానంలో అన్ని యాజమాన్యాల పరిధిలో 239, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 335 ఖాళీలు ఉన్నాయి. మైదానం కంటే ఏజెన్సీలోనే ఎస్జీటీ ఖాళీలు ఉన్నాయని గుర్తించారు. కాగా నగరంలో జువెనైల్ సంక్షేమ శాఖ పరిధిలో బాలల కౌమార పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు నాలుగు, స్కూలు అసిస్టెంట్ పోస్టు ఒకటి వెరసి ఐదు ఉన్నాయి.

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్

... 5వ పేజీ తరువాయి

తర్లువాడలో మరో డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేస్తుందని, దీంతో విశాఖపట్నం పెద్ద డేటా సెంటర్‌గా మారనుందని గంటా వెల్లడించారు.

విశాఖలో సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ సెంటర్

డేటా సెంటర్ నిర్వహించాలంటే అత్యంత వేగవంతమైన 'స్పీడ్ ఇంటర్నెట్' అవసరం. దీనికి అవసరమైన కేబుల్‌ను ల్యాండ్ లైన్ ద్వారా కాకుండా సముద్ర గర్భం నుంచి తీసుకువస్తారు. దీనిని 'సబ్‌మెరైన్ కేబుల్'గా వ్యవహరిస్తారు. సింగపూర్ నుంచి తీసుకువచ్చే ఈ లైన్‌కు విశాఖపట్నంలో 'కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (సీఎల్ఎస్) ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దేశంలో ఇలాంటి స్టేషన్లు ఇప్పటికే ముంబై, చెన్నై, కొచ్చిన్, టుటికోరిన్, త్రివేండ్రంలలో ఉన్నాయి. కొత్తగా విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వల్ల ఇక్కడ అదానీ, గూగుల్ సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకువచ్చాయి.

వైఎంసీఏలో 26 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

మహారాణిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని వైఎంసీఏలో ఈ నెల 26 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ రెవరెండ్ జి.స్టెవిన్ పీటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 38 శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ నెల 26 నుంచి మే 31 వరకు 5 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయస్సు విద్యార్థులకు శిబిరంలో ప్రవేశం ఉంటుందన్నారు. అబాకస్/ఎంఎ, ఎరోబిక్స్, ఎయిర్ గన్ రైఫిల్ షూటింగ్, కాలిగ్రాఫ్, చెస్, క్రికెట్, డ్యాన్స్ డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, జూడో, కరాటే, మ్యూజిక్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, జూడో సెల్ఫ్ డిఫెన్స్, యోగ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



చోరీ సొత్తును బాధితులకు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

85 చోరీ కేసుల్లో 112 మంది అరెస్టు

సీపీ శంఖబ్రత బాగ్చి

బాధితులకు చోరీ సొత్తు పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెలలో జరిగిన 85 చోరీ కేసులను ఛేదించి నేరాలకు పాల్పడిన 112 మంది నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలో చోరీల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటూనే... నమోదైన చోరీ కేసులను ప్రత్యేక శ్రద్ధతో ఛేదించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గతనెలలో జరిగిన మూడు దోపిడీలు, నాలుగు పగటిపూట ఇళ్లలో చోరీలు, రాత్రిపూట 8 ఇళ్లలో జరిగిన దొంగతనాలు, నాలుగు చైన్‌స్నాచింగ్‌లు, 21 మోటార్ సైకిళ్ల చోరీలు, 45 ఇతర చోరీలను ఛేదించామని శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి 1026.6 గ్రాముల బంగారం, 1.61 కిలోల వెండి, రూ.9.49 లక్షల నగదు, 22 బైకులు, 324 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఐదు మేకలు, ఐదు లారీల బ్యాటరీలను రికవరీ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.95.40 లక్షలు ఉంటుందని సీపీ వివరించారు. అనంతరం జరిగిన క్రైమ్ మేళాలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతులమీదుగా అందజేశారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య స్వల్ప వివాదం

కత్తితో దాడి చేయడంతో ఒకరికి గాయాలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇరువురు స్నేహితుల మధ్య మద్యం మత్తులో శుక్రవారం రాత్రి స్వల్ప వివాదం జరగడంతో కత్తితో దాడి చేశాడు. న్యూపోర్టు టి.కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ దరి టీజీఆర్‌నగర్‌కు చెందిన పోతల మధు, పెదగంట్యాడకు చెందిన వి.శ్రీరామ్‌లు మరో నలుగురి స్నేహితులతో కలిసి దయాళ్‌నగర్ కొండపై మద్యం సేవించారు. అక్కడ నుంచి మొల్లివానిపాలెం చేరుకున్నాక ఓ పాన్ షాపు వద్ద వీరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. దీంతో శ్రీరామ్ తన కీచైన్‌కు ఉన్న చాకుతో మధు గొంతుపై పొడిచాడు. రక్తం కారడంతో మిగతా వారంతా అక్కడ నుంచి వెళ్లిపోయారు. బాధితుని పిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు శ్రీరామ్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడిని చికిత్స నిమిత్త ఆస్పత్రికి తరలించారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ(పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం(పాతది)48, బరబాటి22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 24, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడిఅల్లం 48, బొప్పాయి42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ హరేంధిర ప్రసాద్



63వ వార్డులో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని

- **జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**
- **పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల నిర్వహణ**

గాజువాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో లీడ్, మెర్క్యూరీ, కాడ్మియం వంటి విష పదార్థాలు ఉంటాయని, ఇవి భూమిలోకి చేరి పర్యావరణాన్ని నాశనం చేస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. తద్వారా ప్రజలు అనేక అనారోగ్యాల బారిన పడతారన్నారు. 67వ వార్డులోని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, ఈ-చెక్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగిన పద్ధతుల్లో నిర్వహిస్తే మంచిదని, లేకుంటే చాలా సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాల్సిన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్, జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలైన కంప్యూటర్లు, ఫోన్లు, బ్యాటరీలు, ప్రింటర్లు, వాషింగ్ మిషన్లు తదితరాలు పర్యావరణానికి హానికరమని జాతీయ సేవాపథకం జిల్లా నోడల్ అధికారి ఈవీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం ప్రకాశనగర్ శాఖ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల సీసం, పాదరసం తదితర ప్రమాదకర పదార్థాలు భూమిలో కలిసి నేల, నీరు కలుషితమవుతున్నాయని, ఇవి మానవ జీవితంపై దుష్ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటితో నరాలు, మూత్ర పిండాల వ్యాధులు ప్రబలి, క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని దూరం చేయడానికి ప్రజలంతా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, అధికారులు అంజలిదేవీ, నదియా, సంధ్య, సిస్టర్ సుగంధి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీహరిపురం ప్రాంతంలో పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



పెందుర్తి రైతుబజార్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు, ఎస్టేట్ అధికారి, సిబ్బంది

58వ వార్డు శ్రీహరిపురం ప్రాంతంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ వస్తువుల వలన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు పొత్తబత్తుల శ్రీనివాసరావు, రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి రైతుబజార్‌లో రైతులు ఎస్టేట్ అధికారి వీఎస్పీ షర్మిల ఆధ్వర్యంలో స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుబజార్ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్‌ను విక్రయించడం, వినియోగించడం వద్దని, ఎలక్ట్రానిక్ డివైస్‌లు వాడరాదని రైతులకు అవగాహన కల్పించారు. చెత్తాచెదారం ఎత్తివేసి మొక్కలు నాటారు. అనంతరం రైతులు స్వచ్ఛదివస్‌పై ప్రతిజ్ఞ చేశారు. సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింధియా: స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 40, 61, 62, 63 వార్డుల్లో జరిగింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 63వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతీ ప్రభుత్వ కార్యాలయాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. జీవీఎంసీ సీఓలు, ఆర్‌పీలు, డ్వాక్రా మహిళలు, సచివాలయ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ వ్యర్థాలు ఇంటిలో ఉంచొద్దని, వాడేసిన బ్యాటరీలు, సెల్‌ఫోన్ తదితర పరికరాలను స్వీకరించి జోనల్ కార్యాలయానికి తరలించారు. ప్లాస్టిక్‌ను వాడరాదని ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి వర్కర్స్, ఆర్‌పీలు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు, పాఠకులు లైబ్రరీ లోపల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రంథాలయ ర్యాక్‌ల్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళిని తొలగించారు.

అగనంపూడి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడికక్కడ పడేస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. ఎలక్ట్రానిక్ వేస్ట్‌పై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో సీసం, పాదరసం కాడ్మియం, బ్రోమినేటెడ్ జ్వాల నిరోధకాలు వంటి హానికరమైన పదార్థాలు ఉంటాయన్నారు. వీటివల్ల భూమికి హానికరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఏవో రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం వంటి వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. హైస్కూల్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను వివరించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, మహ్మద్ ఇస్మాయిల్, పి.కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. శనివారం గౌతు లచ్చన్న వర్ధంతిని పురస్కరించుకుని 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శ్రీరథాలమ్మ శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రామయ్య మాట్లాడుతూ గౌతు లచ్చన్న దేశం కోసం ఆంగ్లేయులతో పోరాడి ఎన్నోసార్లు జైలుకు వెళ్లారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేని వన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పోతల కృష్ణ, గెద్దాడ రాంబాబు, జి.ఈశ్వరరావు, అప్పారావు, నూకరాజు, నాగరాజు, సత్యనారాయణ, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు పరిధి కణితిలో వైసీపీ నాయకులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు, ఎం.దామోదర్, డి.దానప్పలు, బి.గోవిందరాజులు, రమణ, తదితరులు పాల్గొన్నారు.



వడ్లపూడిలో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీరథాలమ్మ శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న బాటలో నేటి యువతరం నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు అన్నారు. సమతానగర్‌లోని సంఘ కార్యాలయంలో గౌతు లచ్చన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాల కంటే ప్రజల సమస్యల పరిష్కారానికే గౌతు లచ్చన్న అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, ప్రతినిధులు బి.పరదేశి, నెల్లి శ్రీనివాసరావు, దేవన్‌రాజు, భాస్కరరావు, కనకరాజు, లాయర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. పేదలకు నిత్యావసర పంపిణీ చేశారు.

పెందుర్తికే మేయర్ పదవి

ఎన్నికల ప్రచారం నాటి చంద్రబాబు హామీని గుర్తుచేస్తూ పీలా అభిమానుల సంబరాలు

పెందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయరుపై అవిశ్వాస తీర్మానంలో కూటమి విజయం సాధించడంతో శనివారం 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పెందుర్తిలో సంబరాలు నిర్వహించారు. పీలా కార్యాలయం ఎదుట టపాకాయలు పేల్చి, మిఠాయిలు తినిపించుకుని నగర మేయరు పీలా శ్రీనివాస్ అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. జీవీఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో పెందుర్తి విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్థానిక నాలుగురోడ్ల జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో నగర మేయరు పీలా శ్రీనివాసరావు అని ప్రకటించిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్‌ను సామాజిక మాధ్యమాల్లో పెట్టి కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. మేయరుగా పీలా శ్రీనివాస్ ఎన్నిక లాంఛనమే అని అంటున్నారు. మేయరుగా పీలా ప్రమాణం చేస్తారని పెందుర్తిలోనూ చర్చలకు తెరలేచింది.

హిందువులు ఐక్యతతో ఉండాలి



మాట్లాడుతున్న హిందూధర్మ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గౌరయ్య, వేదికపై ఇతర ప్రముఖులు

మల్కాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా ఐక్యతతో మెలగాలని హిందూ ధర్మరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గౌరయ్య పిలుపునిచ్చారు. బాలల్లో ఆధ్యాత్మిక భావన పెరిగేలా చూసే బాధ్యత పెద్దలపై ఉందన్నారు. అలా చేస్తేనే దేశాభివృద్ధితోపాటు హిందుత్వం తరతరాలకు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. 59వ వార్డు హిమచల్‌నగర్‌లో శనివారం హిందూ ధర్మరక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. మత మార్పిడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీను, నాయకులు శ్రీరామ్, కిరణ్, పోలిమేర హరిత, గుత్తుల సతీష్, మల్ల రవి, చంద్రశేఖర్, నాయుడు, స్వామీజీలు పాల్గొన్నారు.

అబ్బురపరచిన అగ్నిమాపక డ్రిల్



ప్రమాద నివారణ యత్నాన్ని చూపుతున్న షిప్‌యార్డు అగ్నిమాపక సిబ్బంది

మల్కాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాన్ని నివారించే పద్ధతిని శనివారం షిప్‌యార్డు అగ్నిమాపక సిబ్బంది చేసి చూపారు. యార్డులో ఓచోట అకస్మాత్తుగా మంటలు చెలరేగడం, క్షణాల్లో అగ్నిమాపక శకటంతో చేరుకుని మంటను అదుపులోకి తెచ్చిన దృశ్యాలు కార్మికులు, సిబ్బందిని ఆశ్చర్యపరిచాయి. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఈ ప్రదర్శన నిర్వహించారు. షిప్‌యార్డు డైరెక్టర్ కమాడోర్ గిరిదీప్ సింగ్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది చురుకుదనం, అంకితభావాన్ని ప్రశంసించారు. అగ్ని-సురక్షిత కార్యాలయం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని తెలియజేశారు.

రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.52,500 విలువ చేసే 10.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్ఐలు జి.కె.మీనా, కె.టి.ఆర్.లక్ష్మి తమ సిబ్బందితో శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన బహారన్‌కుమార్ అనే నిందితుడు గుజరాత్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

క్రైస్తవులకు ఇన్‌చార్జి మంత్రి ఈస్టర్ శుభాకాంక్షలు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానవుల రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై బలియోగమై పునరుత్థానమైన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగ జరుపుకునే క్రైస్తవులందరికీ, విశాఖ ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునేదే ఈస్టర్ పండగ అని అన్నారు.

గల్లంతైన విద్యార్థి కోసం కొనసాగిన గాలింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గంగవరం మాధవస్వామి ఆలయ సమీపంలోని సాగరతీరంలో ఈ నెల 17న గల్లంతైన తొమ్మిదో తరగతి విద్యార్థి తనూజ్ (14) కోసం శనివారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. గంగవరం పోర్టుకు సంబంధించిన సోనా బోట్‌తో సముద్రంలో న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ టి.కామేశ్వరరావు, కానిస్టేబుళ్లు గాలించారు. యారాడ తీరం నుంచి గంగవరం, అప్పికొండ బీచ్ వరకు గాలించినా ఫలితం లేకుండా పోయింది.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

గాజువాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పాతకర్నవానిపాలెం రామాలయం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అష్టోత్తర పూజలు, హోమంతో పాటు మహా శివునికి రుద్రాభిషేకాలు చేశారు. పూజల్లో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు, నాయ కులు సిరసపల్లి అప్పారావు, అప్పలరాజు, లక్ష్మి, రత్నం, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వ హిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డీజీఎం హనుమంతరావు, తదితరులు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'నారాయణ' హవా

సిరిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు (హాస్టల్ డివిజన్) మరోసారి విజయకేతనం ఎగురవేసినట్టు డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఆలిండియా ఫలితాల్లో వివిధ కేటగిరిలలో 100లోపు 2, 12, 16, 36, 42, 44, 72 ర్యాంకులతో పాటు వెయ్యిలోపు, విశాఖపట్నం నారాయణ హాస్టల్ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో పప్పల శ్రీహర్షవర్ధన్ 26వ ర్యాంకు, పీతల టీను ఆనంద్‌చక్రవర్తి 86వ ర్యాంకు, ఆటించయ్యా పాండే 95వ ర్యాంకు, పూర్ణసాయి మామిడి 116, ఆరంగి సాత్విక్ 271, లక్కినేని సాయిప్రీతమ్ 326, తాలాబత్తుల మనోహర్ 328, ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం పెద్దిబొట్ల 461, పాట్నూరు కార్తీక్ 481, కొత్తకోట వెంకట అరవింద్‌కుమార్ 494, గౌతమ్ విజయకశ్యప్ తోటకూర 513, బోదల ఈశ్వర్‌తానూజ్ 521, ప్రభాస్ చంద్రసింగ్ 692, లక్ష్యజైన్ 732, పి.ప్రశాంత్ 818వ ర్యాంకులతో పాటు వందలోపు 3 ర్యాంకులు 500లోపు 10 ర్యాంకులు వెయ్యిలోపు 15 ర్యాంకులు సాధించారన్నారు. ఈ ర్యాంకులు సాధించడం వెనుక అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా విజయాలు సాధించగలిగామన్నారు.అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డీజీఎం డి.హనుమంతరావు, డీన్ పి.స్వరూప్ అభినందనలు తెలియజేశారు.

గాజువాక 'శ్రీచైతన్య' విద్యార్థులకు ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యా సంస్థ ప్రతినిధులు

గాజువాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025లో గాజువాక శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కేవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్ శాలిని చౌదరి 142వ ర్యాంకు, వై.సత్యం 226, ఎస్.హేమహవిల్ 354, జి.వెంకట శంకర్ 839, ఆర్.వంశీకృష్ణ 1,014వ ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం పి.శ్రీనివాసరావు, డీన్‌లు కె.బంగారుబాబు, ఎస్.రఘుకుమార్, పి.నాగేశ్వరరావు, ఎస్.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ నుంచి 73వ వార్డు కార్పొరేటర్‌ను తొలగించాలి'

గాజువాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా.. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాతను తెలుగుదేశం పార్టీ నుంచి శాశ్వతంగా తొలగించాలని పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని రోజుల పాటు టీడీపీ కండువా వేసుకుని పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన సుజాతకు తెలుగుదేశంతో ఎటువంటి సంబంధం లేదన్న విషయాన్ని వార్డు ప్రజలు గ్రహించాలని కోరారు.

స్టీల్‌ప్లాంటులో మొత్తం 10,943 మంది ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ప్రస్తుతం 10,943 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి కర్మాగారంలో 7,620 మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు, 3,323 మంది అధికారులు కలిపి మొత్తం 10,943 మంది విధులు చేపడుతున్నారు.

ఆత్మవిశ్వాసం అందించిన విజయం

- ఇదే స్ఫూర్తితో జీవిత లక్ష్యాలు సాధిస్తాం
- జేఈఈ మెయిన్-25 ఆలిండియా అత్యుత్తమ ర్యాంకర్ల అభిప్రాయాలు

జేఈఈ మెయిన్-2025లో నగరానికి చెందిన పలువురు విద్యార్థులు ఆలిండియా స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఎప్పుడూ తమ లక్ష్యాలను మర్చిపోకుండా శ్రద్ధతో చదవడం, లెక్చరర్ల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే తమ విజయానికి కారణమని పలువురు ర్యాంకర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విజయం తమతో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత బాగా చదివి జీవిత లక్ష్యాలను సాధిస్తామని చెప్పారు. నగరానికి చెందిన పలువురు ఐఐటీ ర్యాంకర్ల అభిప్రాయలు ఇవి.

ఎలక్ట్రికల్ ఇంజనీర్ అవుతా



పేరు : అచింత్య పాండే
జేఈఈ ర్యాంకు : ఓపెన్ కేటగిరిలో 95వ ర్యాంకు
తల్లిదండ్రులు : సమీర్‌కుమార్ పాండే, స్టీల్ ప్లాంట్ (ప్రైవేటు స్కూలు టీచర్), కవితా పాండే (గృహిణి)
ప్రాంతం : విశాఖపట్నం
ఎలా సన్నద్ధం : సందేహాలకు సంబంధించి ఒకటికి రెండుసార్లు చదువుకునేవాడిని.
లక్ష్యం : ముంబై ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో జాయిన్ అవుతా. తరువాత ఇంజనీర్ కావాలని ఆకాంక్ష.

సీఎస్ఈలో చేరతా..



పేరు : మామిడి పూర్ణసాయి
జేఈఈ ర్యాంకు : ఓపెన్ కేటగిరిలో 116వ ర్యాంకు
తల్లిదండ్రులు : ఎం.శివనగేష్ (టీచర్), ఎం.వేణు (టీచర్)
ప్రాంతం : విశాఖపట్నం
ఎలా సన్నద్ధం : ప్రతిరోజు పరీక్షలను రాసేవాడిని. మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో పాజిటివ్‌గా ఉండేవాడిని. ప్రణాళికాబద్ధంగా ప్రిపేరయ్యా.
లక్ష్యం : ఐఐటీ ముంబైలో సీఎస్ఈలో జాయిన్ అవుతా.

ఐఐటీ చెన్నైలో సీఎస్ఈ చేస్తా



పేరు : పి.ఆదివిష్ణు
జేఈఈ ర్యాంకు : ఓపెన్ కేటగిరిలో 461వ ర్యాంకు
తలిదండ్రులు : శ్రీరామ్ స్టాఫ్‌వేర్ ఇంజనీర్, శిరీష (డాక్టర్)
ప్రాంతం : విశాఖపట్నం
ఎలా సన్నద్ధం : ప్రతి రోజూ 11 గంటల పాటు చదువుకునేవాడిని. ఏమైనా సందేహాలు వస్తే ఒకటికి రెండుసార్లు చదివి స్వతహాగా నివృత్తి చేసుకునేవాడిని.
లక్ష్యం : ఐఐటీ చెన్నైలో సీఎస్ఈ చేస్తాను.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో చేరతా..



పేరు : లక్ష్యదీప్ జైన్
జేఈఈ ర్యాంకు : ఓపెన్ కేటగిరిలో 732వ ర్యాంకు
తల్లిదండ్రులు : శశికుమార్ జైన్ (వ్యాపారం), రాజశ్రీ (గృహిణి)
ప్రాంతం : విశాఖపట్నం (అక్కయ్యపాలెం)
ఎలా సన్నద్ధం : రోజులో ఎక్కువ సేపు చదువుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించేవాడిని. ఎప్పటికప్పుడు పరీక్షలకు సంబంధించిన టెస్ట్‌లు రాసేవాడిని.
లక్ష్యం : ఐఐటీ ముంబైలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో జాయిన్ అవుతా.

సివిల్స్ చేయడమే ధ్యేయం



పేరు: తమ్మిన హేమ సాయిసూర్య కార్తీక్
ర్యాంకు: 75, శ్రీ చైతన్య కళాశాల, విశాఖపట్నం/విజయవాడ
తల్లిదండ్రులు: తండ్రి జగన్మోహనరావు ప్రైవేటు కళాశాల లెక్చరర్, తల్లి దీపిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు
ప్రాంతం: విజయనగరం
లక్ష్యం : ముంబై ఐఐటీలో సీఎస్ఈ చేసి సివిల్స్‌లో రాణించాలన్నదే ధ్యేయం.

టార్గెట్ సివిల్స్..



పేరు: ఆర్.కార్తీక్
ర్యాంకు: 212, శ్రీచైతన్య కళాశాల, విశాఖపట్నం/విజయవాడ
తల్లిదండ్రులు: తండ్రి మురళీ, తల్లి సత్యవతి ప్రభుత్వ ఉపాధ్యాయులు
ప్రాంతం: గజపతినగరం, విజయనగరం జిల్లా
లక్ష్యం: సివిల్స్‌లో ర్యాంకు సాధించి బ్యూరోక్రాట్ అధికారిగా ప్రజలకు సేవలందిస్తా.

సీఎస్ఈ చేస్తా..



పేరు: సకినాన హరిచరణ్
ర్యాంకు: 380, ఓబీసీలో 53), శ్రీ చైతన్య కాలేజీ, విశాఖపట్నం
తల్లిదండ్రులు: తండ్రి చంద్రశేఖరరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తల్లి సుహాసిని ప్రైవేటు స్కూల్ టీచర్
ప్రాంతం: బొబ్బిలి వద్ద అలగంజి, విజయనగరం జిల్లా
లక్ష్యం: మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చేయాలన్నదే లక్ష్యం

ముంబై ఐఐటీలో చేరాలి



పేరు: కె.రసజ్ఞ
ర్యాంకు: 422, (ఓబీసీలో 60వ ర్యాంకు), శ్రీచైతన్య, విశాఖపట్నం/విజయవాడ
తల్లిదండ్రులు: తండ్రి శ్రీనివాసరావు, తల్లి రమణమ్మ హెల్త్ డిపార్ట్‌మెంట్
ప్రాంతం: పనసనందివాడ, వీరఘట్టం మండలం, మన్యం జిల్లా
లక్ష్యం: ఐఐటీ ముంబైలో చేరాలన్నదే ముందున్న ధ్యేయం.

కూటమి సంబరాలు

జీవీఎంసీ మేయర్ పీఠాన్ని ఎట్టకేలకు కూటమి కైవసం చేసుకుంది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శనివారం జరిగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో నెగ్గింది. మొత్తం సభ్యుల్లో 74 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వడంతో కలెక్టర్ ఓటింగ్ ద్వారా ఈ ప్రక్రియను ముగించారు. గెలుపుతో కూటమి నాయకులు, కార్పొరేటర్లు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



కార్పొరేటర్లతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు తదితరులు



జనసేన పార్టీకి చెందిన కార్పొరేటర్లతో పెందుర్తి, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్



విక్టరీ సింబల్ చూపుతున్న తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన కార్పొరేటర్లు



విక్టరీ సింబల్ చూపిస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



టీడీపీ కార్పొరేటర్లతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు

ఏయూ దూర విద్య ప్రక్షాళన!

- సిఫారసు చేసిన విచారణ కమిటీ
- వాగ్దేవిలో మాస్ కాపీయింగ్ జరిగినట్టు నిర్ధారణ
- ఉపకులపతి చేతికి నివేదిక
- వాగ్దేవి కాలేజీలో పరీక్షా కేంద్రం రద్దు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని దూర విద్యా కేంద్రాన్ని తక్షణం ప్రక్షాళన చేయాలని సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ నేతృత్వంలోని కమిటీ అభిప్రాయపడింది. దూరవిద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని, పరీక్షా కేంద్రాల్లో అడ్డగోలు వ్యవహారాలు సాగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాస్ కాపీయింగ్ వ్యవహారంపై విచారణకు సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆరోపణలు వచ్చిన కొత్తవలసలోని వాగ్దేవి కాలేజీ తోపాటు దూరవిద్యలో జరుగుతున్న అనేక వ్యవహారాలకు పరిశీలించింది. వాగ్దేవి కాలేజీలో మాస్ కాపీయింగ్ జరిగినట్టు తేల్చడంతోపాటు దూరవిద్య ప్రక్షాళనకు కీలక సూచనలిచ్చింది. వచ్చేనెల 21 నుంచి జరగనున్న పరీక్షలకు ఈ కేంద్రాన్ని రద్దు చేయాలని సూచించింది. కమిటీ సూచనలకు అనుగుణంగా వాగ్దేవిలో పరీక్షా కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రకటించారు. ఈ కేంద్రానికి కేటాయించిన విద్యార్థులను కొత్తవలస ప్రగతి డిగ్రీ కాలేజీకి కేటాయిస్తామన్నారు. ప్రాథమిక ఆధారాలను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

కమిటీ సిఫారసులివీ...

దూరవిద్య వ్యవహారాలపై కమిటీ కీలక సూచనలను చేసింది. స్టడీ, ఎగ్జామినేషన్ సెంటర్లు ఒక దానిలో ఉండకూదని సూచించింది. విద్యార్థుల కేటాయింపు విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సూచించింది. మాస్ కాపీయింగ్ జరిగేందుకు ప్రైవేట్ కాలేజీల్లో అవకాశం ఉందని, పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించింది. పరీక్షల అనంతరం జవాబుపత్రాలు అదేరోజు వర్సిటీకి చేరడంతో పాటు ప్రభుత్వ కాలేజీలకు పరీక్షా నిర్వహణ బాధ్యత అప్పగించే అంశాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. పరీక్షా కేంద్రాలను భారీగా పెంచారని, దీనిపై సమీక్షించాలని తెలిపింది. డబ్బులు వసూలు చేసి పరీక్షా కేంద్రాలుగా అనుమతి ఇచ్చిన తీరును నివేదికలో పేర్కొంది. ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణను రద్దుచేయాలని పేర్కొంది. ఇక్కడ పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి వ్యవహరలపై నివేదికలో ప్రస్తావించినట్టు తెలిసింది.

రైల్వేల ప్రైవేటీకరణ వద్దు

సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డా. కె.హేమలత డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైల్వేలను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించాలని చూస్తోందని, దీనిని ఆపాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డా.కె.హేమలత, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అఖిల భారత డిప్యూటీ సెక్రటరీ జనరల్ పర్స్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. రైల్వేలో అత్యంత కీలక విభాగాలైన సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్, ఇంజనీరింగ్ తదితర విభాగాలను ప్రైవేటీకరణ చేసిందన్నారు. ఏడేళ్ల క్రితమే ప్రమాదాల నివారణకు రైల్వే టాస్క్‌ఫోర్స్, కాగ్ తదితర కమిటీలు అనేక సూచనలతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారన్నారు. అయితే ప్రభుత్వం వాటిని పక్కన పెట్టిందన్నారు. మన రైల్వేలు ప్రతి రోజు 2.5 కోట్ల మంది ప్రయాణికులను, 8 లక్షల టన్నుల సరుకులను చౌకగా రవాణా చేస్తున్నాయన్నారు. ఇంతటి ఆదాయం ఉన్న రైల్వేలను ప్రైవేటీకరణ చేయరాదని కోరారు. రైల్వే ప్రయాణికులకు భద్రత ఇవ్వాలని సూచించారు. సదస్సులో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సీహెచ్ నర్సింగరావు, యూనియన్ నాయకులు వి.ఉమామహేశ్వరరావు, చౌబే, బోలేనాథ్, నరసింహులు, శ్రీనివాస్, అవతారం, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగానే కూటమికి కార్పొరేటర్ల మద్దతు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై జరిగిన అవిశ్వాస తీర్మానానికి వైసీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు స్వచ్ఛందంగానే మద్దతు ప్రటించారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ఎవరినీ ప్రలోభాలకు గురిచేయలేదన్నారు. వైసీపీ నేతల ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. విశాఖ ఎంపీ ఎం.భరత్ మాట్లాడుతూ జీవీఎంసీలో వైసీపీ చేసిన అవినీతిని సహించలేకే ఆ పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారన్నారు.

అరాచక పాలన నుంచి విశాఖకు విముక్తి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నాలుగేళ్ల వైసీపీ అవినీతి, అరాచక పాలన నుంచి విశాఖకు విముక్తి లభించిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార మదంతో జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ సాగించిన దౌర్జన్యాన్ని, దారుణాలను ప్రజలెవరూ మరచిపోలేరన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తున్న సీఎం చంద్రబాబు స్ఫూర్తితో నగరాన్ని అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. ప్రజారంజక పాలనను అందించి జీవీఎంసీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ఎన్ని కుతంత్రాలు చేసినా ఏకతాటిపై నిలిచి అవిశ్వాస తీర్మానాన్ని గెలిపించిన కూటమి కార్పొరేటర్లకు గంటా అభినందనలు తెలిపారు.

చంద్రబాబుకు పుట్టినరోజు కానుక మేయర్ పీఠం: ప్రణవ్

విశాఖపట్నం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు 75వ పుట్టినరోజు కానుకగా 74 మంది సభ్యులు మేయర్ పీఠాన్ని ఇచ్చారని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అన్నారు. జీవీఎంసీ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గెలవడంతో ఆయన ఈ కామెంట్ చేశారు. ఈ విజయం వెనక విశాఖకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు చేసిన కృషి ఉందన్నారు. జీవీఎంసీలో కూటమి పాలన రావడంపై నగరవాసులు సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీలో ఒక్క కార్పొరేటర్ కూడా ఉండర న్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీవిశ్వ విద్యార్థుల విజయభేరి



ర్యాంకులు సాధించిన శ్రీవిశ్వ విద్యార్థులు

సీతంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో విశాఖపట్నంలోని శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక ర్యాంక్‌లు సాధించారు. తల్లూరి చరణ్ కార్తికేయ 311వ ర్యాంక్, అంజూరి తారక రామ్ 407, సీహెచ్ వెంకట హేమవర్ధన్ 586, బి.షణ్ముఖ నాయుడు 648, వై.రాజశేఖర్ 688వ ర్యాంక్ సాధించారు. సాధారణ విద్యార్థుల్లోనూ శ్రీవిశ్వ అసాధారణ ఫలితాలు సాధించిందని విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు. డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. 1000 ర్యాంక్‌లోపు అయిదుగురు, 5000 ర్యాంక్‌లోపు 29 మంది, 10,000 ర్యాంక్‌లోపు 47 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. దాదాపు 247 మంది ప్రముఖ ఎన్ఐటీ, ఐఐటీలలో సీటు పొందే ర్యాంక్‌లు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చాటి న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బందిని వారు అభినందించారు.

'ఎసెంట్' విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయిలో (రిజర్వుడు) నాలుగో ర్యాంకు సాధించిన పూజితకృష్ణను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025లో ఎసెంట్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన సత్తిరాజు పూజిత కృష్ణ రిజర్వుడు కేటగిరిలో జాతీయస్థాయి నాలుగో ర్యాంకు సాధించాడు. అలాగే 203, 208,408, 450, 618, 813, 926, 941, 983 వంటి ఆలిండియా ర్యాంకులను పలువురు విద్యార్థులు సాధించారు. 31 మంది విద్యార్థులు 5000 లోపు ర్యాంకులను సొంతం చేసుకున్నారు. వీరంతా ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'కూటమి'ది అనైతికం

- కార్పొరేటర్లకు ప్రలోబాలు, వేధింపులు
- మేయర్ అవిశ్వాసంపై మండిపడిన వైసీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు, పక్కన అమర్నాథ్, ఎమ్మెల్సీలు రవిబాబు, కల్యాణి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో కూటమి పార్టీలు అడ్డతోవలో తొక్కాయని, మేయర్ పదవి చేజిక్కించుకున్నా నైతికంగా మాత్రం ప్రజల ముందు ఓటమి పాలయ్యారని వైసీపీ నేతలు మండిపడ్డారు. శనివారం మేయర్‌పై అవిశ్వాస తీర్మానం అనంతరం వైసీపీ నగర పార్టీ కార్యాలయంలో మీడియాతో వైసీపీ నేతలు మాట్లాడారు. తొలువ మాజీ మంత్రి, వైసీపీ ఉత్తరాంధ్ర రీజియన్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఈ అవిశ్వాస తీర్మానంతో కూటమి పార్టీల కుట్రలు, కుతంత్రాలు మరోసారి బయటపడ్డాయన్నారు. అధికార బలంతో వైసీపీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసి, బెదిరింపులకు పాల్పడి తమకు అనుకూలంగా ఓటు వేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేశారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది అనైతికమన్నారు. 74 మంది కార్పొరేటర్ల బలంతో ఈ మేయర్ పీఠాన్ని దక్కించుకున్నామని సంబరపడుతున్నారన్నారు. ఆపసోపాలు పడి మేజిక్ ఫిగర్‌ను చేరుకున్నారని ఎద్దేవా చేశారు. అన్ని ప్రయత్నాలు చేసినా బొటాబొటి స్థానాలే సాధించారన్నారు. కూటమి పార్టీలు ఎన్ని ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడినా పార్టీకి అండగా నిలిచిన వైసీపీ కార్పొరేటర్లకు చేతులెత్తి నమస్కరించారు. విశాఖ మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు కూటమి పార్టీలు తొక్కిన అడ్డదారులు చూస్తే 1995లో చంద్రబాబు వైస్రాయ్ హోటల్ ఉదంతాన్ని మించిందని ఆక్షేపించారు. మేయర్ స్థానం జనరల్‌కు రిజర్వు అయినా.. యాదవ కులానికి చెందిన బీసీ మహిళకు నాడు జగన్ మేయర్‌గా అవకాశం కల్పిస్తే, చంద్రబాబు మాత్రం కుట్రలు, కుతంత్రాలకు తెర లేపి ఆ బీసీ మహిళను పదవీచ్యుతురాలిని చేశారన్న అపఖ్యాతి మూటగట్టుకున్నారని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు కూటమి పార్టీ తమ వద్ద 80 నుంచి 85 మంది కార్పొరేటర్లు ఉన్నారంటూ చేసిన ప్రచారమంతా ఉత్తదేనని తేలిపోయిందన్నారు. కేవలం ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడే అవిశ్వాసం నెగ్గించుకోగలిగారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లందరికీ విప్ జారీ చేశామని, 27 మంది విప్‌ను ధిక్కరించారని, వారిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఏడు రోజుల్లో వారిపై అనర్హత వేటు వేయాలని లేఖలో కోరామన్నారు. అధికారులు పట్టించుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.